ప్రజాశక్తి
సోమవారం 1 డిసెంబర్ 2025 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

అప్పులు తీర్చలేక..

అన్నదాత ఆత్మహత్య

సత్యనారాయణరెడ్డి (ఫైల్)

ప్రజాశక్తి-మార్కాపురం

వ్యవసాయంలో ఏటా నష్టాలు రావడంతో అప్పులు పెరిగాయి. తీర్చ లేనంతగా అప్పుల ఊబిలో కూరుకు పోయాడు. బాకీదారుల ఒత్తిడి తాళలేక ఓ రైతు పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా... మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించారు. ఒంగోలులోని వైద్యశాలలో చికిత్స పొందుతూ.. పరిస్థితి విషమించడంతో ఆదివారం మృతిచెందాడు. మార్కాపురం మండలంలోని కోలభీమునిపాడు గ్రామానికి చెందిన మందా సత్యనారాయణరెడ్డి(45) వ్యవసాయాన్ని నమ్ముకున్నాడు. ఆయనకు ఉన్నది ఎకరం పొలం మాత్రమే. మరో ఎనిమిది ఎకరాలు కౌలుకు తీసుకుని పంటలు సాగు చేస్తున్నాడు. ఈ ఏడాది కూడా వాణిజ్య పంటలైన మిర్చి, పత్తి పంటలు సాగు చేశాడు. గత కొన్నేళ్లుగా వ్యవసాయ పరిస్థితి బాగోలేదు. పంటలకు గిట్టుబాటు ధర ఉంటే.. తెగుళ్ల కారణంగా దిగుబడి తగ్గుతుంది. పంట బాగా పండిన సమయంలో గిట్టుబాటు ధర ఉండదు. అంతా బాగుందనుకున్న సమయంలో ప్రకృతి అనుకూలించదు. ఈ రకంగా రైతన్నలు నష్టాలే తప్ప లాభాలు చూడటం లేదు. మందా సత్యనారాయణరెడ్డి విషయంలోనూ కాలం కలిసిరాలేదు. గత ఏడాది పంటలకు ▶ 2లో

'దిత్వా' గండం తప్పదా.?

- ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో నేడు, రేపు భారీ వర్షాలు
- ఒంగోలు చేరుకున్న ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందం
- అప్రమత్తమైన యంత్రాంగం

ఆదివారం నాడు వచ్చిన పర్యాటకులను దిత్వా తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు వెనక్కి పంపడంతో నిర్మానుష్యంగా ఉన్న బాపట్ల, సూర్యలంక సముద్ర తీరం..

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్, బాపట్ల జిల్లా

నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన ద్వితా తుపాన్‌తో ప్రకాశం, బాపట్ల జిల్లాలకు గండం తప్పేటట్లు లేదు. చెన్నై-పుదుచ్చేరి మధ్య ఏర్పడిన అల్పపీడనం తీవ్ర వాయుగుండంగా మారింది. తుపాన్ కారణంగా ఆదివారం నుంచి రెండు జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. తుపాన్ కారణంగా సోమ, మంగళవారాలలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని విపత్తుల నివారణ సంస్థ ప్రకటించింది. ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగం సర్వసన్నద్ధమైంది. వర్షాల నేపథ్యంలో సోమవారం నాడు నిర్వహించాల్సిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)ను రద్దు చేస్తున్నట్లు రెండు జిల్లాల కలెక్టర్లు ప్రకటించారు.

ఒంగోలు చేరుకున్న ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందం

దిత్వా తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో నేషనల్ డిజాస్టర్ రెస్క్యూ ఫోర్స్(ఎన్‌డిఆర్‌ఎఫ్) 30 మంది సభ్యుల బృందం ఒంగోలు చేరుకుంది. ఒంగోలు అంబేద్కర్ భవనంలో ఈ బృందం బస చేసింది. ఈ బృందానికి కమాండర్ దిగ్బాల్ సింగ్ నేతృత్వం వహిస్తున్నారు. తుపాన్ నేపథ్యంలో అత్యవసర పరిస్థితులు ఏర్పడినప్పుడు ఈ బృందం జిల్లాలోని తీర ప్రాంత మండలాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేసుకుంది. చెట్లు కూలినా, విద్యుత్ స్తంభాలు నేలకొరిగినా, ప్రజలు వరద నీటితో చిక్కుకుంటే వారిని రక్షించేందుకు ప్లాష్ లైట్లు, అవసరమైన సామాగ్రితో బృందం సిద్ధంగా ఉంది.

విపత్తును ఎదుర్కొనేందుకు సిద్ధం

దిత్వా తుపాన్ ప్రభావంతో జిల్లాలో ▶ 2లో

ఒక్క ఫోన్ కాల్..

రూ.7,44,990 మాయం

పోలీస్‌స్టేషన్‌లో బాధితుడి ఫిర్యాదు 3లో

కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

పెంచలయ్య హంతకులను కఠినంగా శిక్షించాలి..

- ప్రజాసంఘాల డిమాండ్
- కొవ్వొత్తులతో నివాళి

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

నెల్లూరులో యాంటీడ్రగ్స్ ఉద్యమంలో చురుగ్గా పనిచేస్తున్న డివైఎఫ్ఐ కార్యకర్త, ప్రజా కళాకారుడు పెంచలయ్యను గంజాయి ముఠా దారుణంగా హత్య చేసిన ఘటనను ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, ఐద్వా, ప్రజా నాట్యమండలి నాయకులు తీవ్రంగా ఖండించారు. పెంచలయ్యను హత్య చేసిన గంజాయి ముఠా గుండాలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆదివారం నాడు ఒంగోలు, సాయిబాబా గుడి సెంటర్ వద్ద కొవ్వొత్తులు వెలిగించి నివాళు లర్పించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా నాయ కులు సి హెచ్ వినోద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి మాటా ్లడారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ ఒంగోలు నగర కార్యదర్శి పి. కిరణ్, ఎస్ఎఫ్ఐ నాయకులు విజయ్, ఆనంద్, ఐద్వా నాయకులు రాజేశ్వరి ప్రజానాట్యమండలి నాయకులు ఎస్.ఇంద్రజ్యోతి, డివైఎఫ్ఐ నాయకులు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం ఆధ్వర్యంలో..

నెల్లూరు సిపిఎం కార్యకర్త ప్రజా నాట్యమండలి కళాకారుడు పెంచ లయ్యను హతమార్చిన గంజాయి ముఠా గుండాలను కఠినంగా శిక్షిం చాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ హత్యను నిరసిస్తూ సిపిఎం ఒంగోలు నగర కమిటీ ఆధ్వర్యంలో గాంధీనగర్ 37వ డివిజన్‌లో ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. పట్టపగలే దారుణంగా హతమార్చిన ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం ▶ 2లో

సిపిఎం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన

పెంచలయ్య హంతకులను శిక్షించాలి

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. ఈ సందర్భంగా నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ పెంచలయ్య కుటుంబానికి న్యాయం జరిగే వరకు పార్టీ అండగా ఉంటుందని ప్రకటించారు. న్యాయం జరగకపోతే రాష్ట్రవ్యాప్తంగా ప్రజాసంఘాలతో కలిసి ప్రజా పోరాటాలు చేపడతామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమం సిపిఎం జిల్లా నాయకులు కె రమాదేవి, నగర నాయకులు ఎన్వీ రాస్వామి, ఎస్‌డి హుస్సేన్, టీ. మహేష్, బి. వెంకటేశ్వరరావు, పార్టీ సభ్యులు రాజేశ్వరి, పీరు, దాసు, గురవయ్య, అమీర్, జబ్బర్, ప్రజాసంఘాల నాయకులు వినోద్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

అప్పులు తీర్చలేక..

(మొదటిపేజీ తరువాయి)

గిట్టుబాటు ధర లేదు. కూలి ఖర్చులు కూడా రాలేదు. పెట్టుబడులన్నీ అప్పులుగా మిగిలిపోయాయి. ఈ ఏడాది సకాలంలో వర్షాలు పడతాయని, గిట్టుబాటు ధర లభిస్తే గత ఏడాది అప్పులైనా తీర్చుకోవచ్చని మిరప, పత్తి పంటలు సాగు చేశాడు. ఇటీవల మొంథా తుపానుతో మిరప, పత్తి పంటలు దెబ్బతిన్నాయి. ఈ కారణంగా సత్యనారాయణరెడ్డి పంటల కోసం చేసిన అప్పులు వడ్డీతో కలుపుకుని రూ.20 లక్షలకు చేరింది. అప్పిచ్చిన వారు తమ బాకీ తీర్చాలని పదేపదే ఇటీవల కాలంలో ఒత్తిడి చేశారు. తనకున్న ఎకరం భూమి అమ్మినా రూ.10 లక్షలకు మించదు. బాకీదారులకు సమాధానం చెప్పుకోలేక ఈ నెల 26వ తేదీన కోలభీమునిపాడులో పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబసభ్యులు వైద్యం కోసం మార్కాపురం తరలించగా అప్పటికే పరిస్థితి విషమించింది. దీంతో ఒంగోలు తరలించారు. చికిత్స అందిస్తున్నా ఫలితం లేకపోయింది. ఆదివారం నాడు సత్యనారాయణరెడ్డి మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. సాగులో పెట్టుబడులు పెట్టిన సత్యనారాయణరెడ్డి ఆర్థికంగా దెబ్బతిన్నాడని, ప్రభుత్వం ఆదుకోవాలని ఆ గ్రామస్తులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. సత్యనారాయణరెడ్డి ఆత్మహత్యపై మార్కాపురం రూరల్ ఎస్ఐ పి అంకమరావు దర్యాప్తు చేపట్టారు.

'దిత్వా' గండం తప్పదా.?

(మొదటిపేజీ తరువాయి)

సోమ, మంగళవారాలు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తముగా ఉన్నట్లు ప్రకాశం జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. ఎలాంటి పరిస్థితి తలెత్తినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఈ దిశగా తీసుకుంటున్న చర్యలను ఆదివారం ప్రకాశం భవనంలోని 'దిత్వా కమాండ్ కంట్రోల్ కేంద్రం'లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో వివరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 14 మండలాలపై తుపాను ప్రభావం ఉంటుందన్నారు. కనిగిరి, కొండపి, కొత్తపట్నం, మర్రిపూడి, మద్దిపాడు, నాగులుప్పలపాడు, ఒంగోలు, పామూరు, పీసీ పల్లి, పొన్నలూరు, సంతనూతలపాడు, టంగుటూరు, సింగరాయకొండ, జరుగుమల్లి మండలాలలో తీవ్రమైన గాలులతో కూడిన వర్షం పడే అవకాశం ఉండటంతో పరిస్థితిని పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టేందుకు ప్రత్యేక అధికారులను నియమించామన్నారు. మొంథా తుఫాను నేపథ్యంలో ఎదురైన అనుభవాలను పరిగణలోకి తీసుకుని ప్రభావిత ప్రాంతాలపై ప్రత్యేక దష్టి పెట్టామన్నారు. అన్ని ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. ఒంగోలు నగరంలోని పోతురాజు కాలువ, నల్ల కాలువలో ప్రవాహానికి ఎలాంటి అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. జిల్లా యంత్రాంగానికి సహకరించేలా 30 మందితో కూడిన జాతీయ విపత్తుల నిర్వహణ బందం (ఎన్‌డిఆర్‌ఎఫ్) కూడా అందుబాటులో ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో డిఆర్ఓ బి.చిన ఓబులేసు, ఎన్.డి.ఆర్.ఎఫ్. కమాండర్ దిల్బాగ్ సింగ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

దిత్వా తుపాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు

పోలీస్ యంత్రాంగం సంసిద్ధంగా ఉండాలి

- మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లవద్దు
- సముద్ర తీర ప్రాంతాలకు ఎవరూ రావద్దు
- జిల్లా ఎస్పీ బి ఉమామహేశ్వర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

దిత్వా తుపాను నేపథ్యంలో మత్స్యకారులెవరూ సముద్రంలో వేటకు వెళ్లవద్దని జిల్లా ఎస్పీ బి ఉమామహేశ్వర్ హెచ్చరించారు. తుపాను ప్రభావం బాపట్ల జిల్లాపై ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరిక జారీచేసిన నేపథ్యంలో జిల్లా ఎస్పీ పోలీస్ యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ఆదివారం జిల్లా పోలీస్ అధికారులతో వీక్షణ సమావేశం నిర్వహించి తుపాను ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు తగిన ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం వాతావరణ శాఖ ఇచ్చిన సమాచారం మేరకు బాపట్ల జిల్లాలోని అద్దంకి, చిన్నగంజాం, రేపల్లె, నిజాంపట్నం, నగరం మండలాలపై తుపాను ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉందన్నారు. మిగిలిన ప్రాంతాలలో కూడా ప్రభావం చూపే అవకాశం ఉందని తెలిపారు. దానికి అనుగుణంగా పోలీస్ అధికారులు తగిన ముందస్తు భద్రత చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాలు, ఎగువ వచ్చే వరద నీటి వలన పొంగిపొర్లే అవకాశం ఉన్న లో-లెవెల్ కల్వర్టులను గుర్తించాలన్నారు. అదేవిధంగా వాగులు, కాలువల కరకట్టలు బలహీనంగా ఉన్న, గతంలో తెగిన ప్రదేశాలపై నిఘా ఉంచాలని తెలిపారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఎక్కడ కూడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఇతర ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయంగా వ్యవహరిస్తూ ఎటువంటి పరిస్థితులు ఎదురైన సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉండాలని తెలిపారు. వరద ముంపునకు గురయ్యే అవకాశం ఉంటే వెంటనే ప్రభుత్వం సూచించిన పునరావాస కేంద్రాలకు, లేదా ఇతర సురక్షితమైన ప్రదేశాలకు వెళ్లాలని ప్రజలకు సూచించారు. ఎటువంటి విపత్కర పరిస్థితిలోనైనా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం సంసిద్ధంగా ఉందని తెలిపారు. రెస్క్యూ, క్యూఆర్టీ బృందాలను సిద్ధం చేశామన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక జెసిబి, కటర్లు, రైన్ కోట్లు, తాళ్లతో సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ప్రజలకు సహాయం అందించేందుకు నిరంతరం అందుబాటులో ఉండే విధంగా సిసిఎస్ డిఎస్పిని ఇన్‌ఛార్జిగా నియమించి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా రేపల్లె, చీరాల సబ్ డివిజన్ పరిధిలలో కూడా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు అత్యవసర పరిస్థితులలో తక్షణ పోలీస్ సహాయం పొందేందుకు కింది నెంబర్‌లకు కాల్ చెయ్యాలని తెలిపారు.

అత్యవసర ఫోన్ నెంబర్: 112
జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్: 83338 13228
కంట్రోల్ రూమ్ ఇన్‌చార్జి సిసిఎస్ డిఎస్‌పి పి.జగదీష్‌నాయక్: 8978777821
కంట్రోల్ రూమ్ ఇన్‌స్పెక్టర్ ఎం రాంబాబు: 8978777261
చీరాల సబ్ డివిజన్ -: 9885380674
రేపల్లె సబ్ డివిజన్ -: 9063536377

దర్శిలో ముస్తాబవుతున్న అన్నా క్యాంటీన్

ప్రారంభానికి సిద్ధమైన అన్నా క్యాంటీన్

ప్రజాశక్తి-దర్శి

స్థానిక కురిచేడు రోడ్డులోని గ్రామీణ నీటి సరఫరా విభాగం కార్యాలయం ప్రక్కనే అన్నా క్యాంటీన్ నిర్మాణం పూర్తి చేసుకొని ప్రారంభానికి ముస్తాబు చేస్తున్నారు. ఈ సందర్భంగా అన్నా క్యాంటీన్ బయట డిజైన్ వర్క్ చేస్తున్నారు. అన్నా క్యాంటీన్ 2018 సంవత్సరంలో ప్రారంభమై 2019లో అప్పటిమొదట టిడిపి ప్రభుత్వంలో అప్పటి మంత్రి సిద్ధ శిద్దారాఘవరావు కాలంలోనే ప్రారంభించాల్సి ఉంది. కానీ అది పూర్తిగా కాకుండానే ప్రభుత్వం మారింది. దీంతో గత ఐదు సంవత్సరాలు వైసీపీ అధికారంలో ఉండటంతో అన్నా క్యాంటీన్లను పట్టించుకోలేదు. దీంతో మరల తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతో ఇక్కడ టిడిపి ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి కృషితో నిధులు కేటాయించి అన్నా క్యాంటీన్‌ను పనులను పూర్తి చేశారు. ఈ సందర్భంగా త్వరలో అన్నా క్యాంటీన్‌ను ప్రారంభిస్తామని ఐదు రూపాయలకే పేద, నిరుపేదలకు భోజనం పెడతామని గతంలో టిడిపి ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మీ ప్రకటించారు. అందులో భాగంగానే అన్నా క్యాంటీన్ పనులు పూర్తయి డిజైన్ పనులు చేస్తున్నారు. ఈ సందర్భంగా దీనిని పూర్తిచేస్తే ప్రారంభిస్తే పేద, నిరుపేదలకు ఐదు రూపాయలకే భోజనం పెట్టనున్నారు.

గుంతలమయంగా ఉన్న రోడ్డు

ఆర్అండ్‌బి రోడ్డు గుంతలమయం

ప్రజాశక్తి-పీసీపల్లి

పెద అలవలపాడు నుంచి పీసీపల్లికి వచ్చే ఆర్అండ్‌బి రోడ్డు గుంతలమయమైంది. వాహన చోదకులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు మొత్తం ఛిద్రమై తారులేచి సుమారు అడుగు నుంచి రెండు అడుగుల లోతు గుంతలు ఉన్నాయి. ఇక్కడ వాహనాలు నడపాలంటే చాలా ఇబ్బందికరంగా ఉంటుంది. ప్రధానంగా రాత్రిపూట వాహనాలు నడపాలంటే మరి ఇబ్బందికరంగా ఉంటుంది. వర్షాకాలంలో ఎక్కువ వానలు పడి గుంతల్లో నీరు చేరినప్పుడు కూడా, ఎక్కడ గుంత ఉందో ఎంత లోతు గుంత ఉందో కూడా తెలియక ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ మధ్యకాలంలో టిప్పర్లు భారీ లోడుతో తిరగటం మూలంగా ఇక్కడ చాలా ఇబ్బందికరంగా ఉంటుంది. అలవలపాడు నుంచి పీసీపల్లికి 9 కిలోమీటర్లు దూరమైనప్పటికీ రాత్రిపూట వాహనాలలో రావాలంటే సుమారు 20 నిమిషాల నుంచి అర్ధగంట సమయం పడుతుంది. ఎదురుగా వాహనాలు వచ్చేటప్పుడు మోటార్ సైకిల్‌పై వెళ్లేవారు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. గుంతల్లో పడి ఒక్కోసారి మోటార్ సైకిళ్ళు ప్రక్కకు పడి గాయాలు పాలవుతున్నారు. పేరుకు ఆర్అండ్‌బి రోడ్డు అయినప్పటికీ మట్టి రోడ్డును తలపిస్తుంది. రోడ్డు మొత్తం మీద సుమారు 100 పైగానే గుంతలు ఉన్నాయి. అధికారులు స్పందించి ఈ రోడ్డుకు మరమ్మతులు చేయాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

కమలా స్కూల్లో వ్యాపార ప్రదర్శన

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం పట్టణంలోని తర్లుపాడు రోడ్ల గల కమల స్కూల్‌లో ట్రేడెక్స్ అనే వ్యాపార కార్యక్రమాన్ని ఆ పాఠశాల చైర్మన్ పెనుగొండ కేశవరావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కేశవరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే రిటైల్ వ్యాపారంపై అవగాహన కల్పించేందుకు ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. ఆ పాఠశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ పెనుగొండ పవన్‌కుమార్ మాట్లాడుతూ రిటైల్ రంగంలో వ్యవస్థాపక నైపుణ్యాలను అలవర్చుకునేందుకు దోహదపడుతుందని అన్నారు. ఆ పాఠశాల డైరెక్టర్ పీవీ సింధుజ మాట్లాడుతూ విద్యార్థుల సృజనాత్మక శక్తి పెరుగుతుందన్నారు. సమకాలీన సమాజంలో వ్యవస్థాపక నైపుణ్యం అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రంజన్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

30 పోలీసు యాక్ట్ అమలు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

శాంతి భద్రతల పరిరక్షణ నిమిత్తంగా, ఒంగోలు సబ్‌డివిజన్ పరిధిలో 01.12.2025 నుంచి 31.12.2025 వరకు 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కాలవ్యవధిలో ప్రజా సంఘాలు, కార్మిక యూనియన్లు, రాజకీయ పార్టీలు, ఇతర సంస్థలు అనుమతి లేకుండా సభలు, సమావేశా లు, ర్యాలీలు లేదా ధర్నాలు నిర్వహించకూడదని డిఎస్పీ స్పష్టం చేశారు. ఏదైనా కార్యాచరణ నిర్వహించాలనుకుంటే, సంబంధిత పోలీస్ ఉన్నతాధికారుల నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని అన్నారు.

పాస్పోర్టు పోయినది

బాపట్ల జిల్లా చీరాల మండలం వాడరేవు గ్రామానికి చెందిన జాలె సతీష్ S/o రూబేను అను నాకు చెందిన P5335391 నెంబరు గల పాస్పోర్టు ది.20-11-2025న వాడరేవు సెంటర్‌నుంచి జిరాక్స్ తీసుకొని వస్తుండగా మార్గమధ్యలో పోయినది. ఎంతవెతికినా దొరకలేదు ఎవరికైనా దొరికిన ఎడల క్రింది మా చిరునామాకు గాని, చీరాల రూరల్ (ఈపూరుపాలెం) పోలీస్‌స్టేషన్ వారికి గాని చేర్చవలసినదిగా ప్రార్థన

ఇట్లు
జాలె సతీష్ S/o రూబేను
SC కాలనీ వాడరేవు, చీరాల మండలం,
బాపట్ల జిల్లా
సెల్ : 9010185120

ప్రజాశక్తి
సోమవారం 1 డిసెంబర్ 2025

తుపాను పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

దిత్వా తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు కోరారు. తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో ఎమ్మెల్యే ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో మాట్లాడి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భారీ వర్షాలు కురుస్తాయన్న తుపాన్ వాతావరణ కేంద్ర హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు వహించాలని కోరారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్ళరాదని, ప్రజలు విద్యుత్ స్తంభాలకు విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలన్నారు. ప్రమాదాలు చోటు చేసుకోకుండా పిల్లలను, పశువుల కాపరులు, రైతులు పొలాలకు వెళ్లేటప్పుడు విద్యుత్ తీగల వద్ద ప్రమాదాలకు దూరంగా ఉండాలన్నారు. ఒంగోలు నగరంలో పోతురాజు కాల్వ వెంట నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏ సమస్య వచ్చినా పార్టీ కార్యాలయంలో ప్రతినిధులు లేక మున్సిపల్ కార్పొరేషన్ అధికారులను సంప్రదించాలని ప్రజలకు సూచించారు. మున్సిపల్ కార్యాలయాలలో ఎమర్జెన్సీ సెంటర్‌ను ఏర్పాటు చేశారని, ఏదైనా సహాయం కావాలంటే మున్సిపల్ కార్యాలయ సిబ్బందికి తెలియజేయాలన్నారు. టీడీపీ కార్యకర్తలు, నాయకులు ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటారని, ఎటువంటి సమస్య ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు కోరారు.

విద్యుత్ సిబ్బందికి సెలవులు రద్దు

భారీ వర్షాలు కురుస్తున్న సందర్భంగా జిల్లా ప్రజలు, రైతులు మరింత అప్రమత్తంగా ఉండాలని ఎపిసిపిడిసిఎల్ ఎస్ఇ కట్టా వెంకటేశ్వర్లు కోరారు. వర్షాల సమయంలో రైతులు, ప్రజలందరూ తగిన సూచనలు పాటించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వర్షాలు, గాలులు ఎక్కువగా వస్తున్నప్పుడు లేదా నీటి నిల్వ ఎక్కువగా ఉన్న చోట విద్యుత్ స్తంభాలను తాకరాదన్నారు. ఎక్కడైనా విద్యుత్ లైన్లు తెగి పడినా, స్తంభాలు విరిగి పడినా వెంటనే కంట్రోల్ రూమ్ 9440817491కి ఫోన్‌చేసి తెలపాలన్నారు. సంబంధిత లైన్‌మెన్, సంబంధిత సబ్ స్టేషన్, ఎస్ఈ కార్యాలయం కంట్రోల్ రూమ్ 9440817491 / 08592233248 నెంబర్లకు ఫోన్ చేయాలని ఆయన కోరారు. జిల్లాలోని విద్యుత్ శాఖ సిబ్బందికి 3 రోజులు సెలవులు రద్దు చేసినట్లు ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు వెల్లడించారు. ఒంగోలు విద్యుత్ భవన్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతూ తుపాన్ సందర్భంగా విద్యుత్ అధికారులందరూ అప్రమత్తంగా ఉండి ఆస్తి నష్టం జరగకుండా చూడాలని కోరారు.

మాట్లాడుతున్న ఎస్ఇ వెంకటేశ్వర్లు

కనపర్తి సముద్ర తీరంలో అలల ఉధృతిని పరిశీలిస్తున్న పరిశీలిస్తున్న అధికారులు

సముద్ర ఉధృతిని పరిశీలించిన అధికారులు

నాగులుప్పలపాడు: తుఫాన్ నేపథ్యంలో లోతట్టు ప్రాంతాలైన కనపర్తి పంచాయతీ పరిధిలోని మేకలసోమయ్య పట్టపుపాలెం, తోపుపాలెం, రెడ్డిపాలెం, కుక్కలవారిపాలెం తదితర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ఆదివారం కనపర్తి తీరంలోని సముద్ర ఉధృతిని అధికారులు పరిశీలించారు. అనంతరం లోతట్టు ప్రాంతాలైన ఆయా గ్రామాల ప్రజలతో మాట్లాడారు. సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్ళాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తుఫాన్ ప్రత్యేక అధికారి డ్వామా పిడి గంగవరపు జోషఫ్ కుమార్, ఎంపీడీవో తేళ్ల రవికుమార్, తహశీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్, పిఆర్ ఏఇ వీరాంజనేయులు, ఏపిఓ రవిబాబు ఉన్నారు.

ఒక్క ఫోన్ కాల్‌తో..

రూ.7,44,990 మాయం

పోలీస్ స్టేషన్లో బాధితుడు ఫిర్యాదు

ప్రజాశక్తి-శింగరాయకొండ

సైబర్ నేరగాళ్లు చేసిన ఒక ఫోన్ కాల్ దెబ్బకు అకౌంట్లో ఉన్న రూ.7,44,990 మాయమైన సంఘటనపై బాధితుడు శింగరాయకొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వివరాల మేరకు.. శింగరాయకొండ మండలం పాకల గ్రామానికి చెందిన బొమ్మిరెడ్డి సునీల్ సిపి ఆక్వా కల్చర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ చెన్నై కంపెనీలో మార్కెటింగ్ జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా బాపట్ల జిల్లా రేపల్లెలో ఉంటూ వ్యాపార లావాదేవీలు చూసుకుంటూ ఉన్నాడు. ఈనెల 26, 27 తేదీల్లో తన అకౌటులో డబ్బులు మాయం అయ్యాయి. సైబర్ క్రైమ్ నేరగాళ్లు ఫోను చేశారని, ఆ ఫోనును లిఫ్ట్ చేయటంతో అకౌంట్లో ఉన్న డబ్బులు మాయమైనట్లు గుర్తించారు. వెంటనే విజయవాడ సైబర్ క్రైమ్‌కి ఫిర్యాదు చేయడంతో ఆ ఫోన్ కాల్ వివరాలను వెల్లడించారు. తనకు న్యాయం చేయాలని ఎస్ఐ బి.మహేంద్రకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ బి.మహేంద్ర కేసు నమోదు చేశారు.

అన్ని హామీలు అమలు చేశాం: మంత్రి

ప్రజాశక్తి-టంగుటూరు

ప్రజలకిచ్చిన హామీలతో పాటు చెప్పని హామీలు కూడా 17 నెలల్లోనే అమలు చేశామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. ఆదివారం నాడు తూర్పునాయుడుపాలెంలో మంత్రి పత్రిక ప్రకటన విడుదల చేశారు. రియల్ ఎస్టేట్ సంస్థలకు భూములు కట్టబెడుతున్నారని వైసీపీ నేత బొత్స సత్యనారాయణ మాట్లాడడం హాస్యాస్పదం అన్నారు. జగన్‌లా మేం భూ దోపిడీకి పాల్పడడం లేదన్నారు. పరిశ్రమలకు రాయితీలు, ప్రోత్సాహకాలు ఇవ్వడం తప్పా అని ప్రశ్నించారు. రాజకీయాలకతీతంగా అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. వైసీపీ నేతల అబద్ధాలు, అసత్యాల్ని ప్రజలు చీత్కరించుకుంటున్నా వారి తీరు మాత్రం మారలేదని మంత్రి మంత్రి స్వామి మండిపడ్డారు.

మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసరావు

గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-పామూరు : గంజాయి అమ్మినా, కలిగి ఉన్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ ఎం.శ్రీనివాసులు హెచ్చరించారు. ఆదివారం సిఐ కార్యాలయంలో పలువురిని పిలిపించి విచారించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ పామూరు సెంట్రల్ పరిధిలోని సీఎస్‌పురం, పామూరు, వెలిగండ్ల మండలాల్లో అక్రమంగా గంజాయి అమ్మకాలు జరిగితే సహించేది లేదని హెచ్చరించారు. ప్రజలు గుర్తించి పోలీస్ స్టేషన్‌కి సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పామూరు ఎస్సై కిషోర్ బాబు, వెలిగండ్ల ఎస్ఐ కృష్ణ పావని, సీఎస్‌పురం ఎస్సై వెంకటేష్ నాయక్ పాల్గొన్నారు.

గుండ్లకమ్మలో పోలీసుల తనిఖీ

ప్రజాశక్తి-మద్దిపాడు

ప్రకాశం జిల్లా ఇన్‌ఛార్జి ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా మద్దిపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని గుండ్లకమ్మ రిజర్వాయర్ పరిసర ప్రాంతాలు, వెంకటేశ్వర స్వామి గుడి వద్ద మద్దిపాడు ఎస్ఐ వెంకట సూర్య, ఆర్ఎస్ఐ తిరుపతిస్వామి ఆధ్వర్యంలో ఆదివారం తనిఖీలు చేపట్టారు. గుండ్లకమ్మ రిజర్వాయర్ చుట్టుపక్కల ఉన్న అన్ని ప్రవేశ మార్గాలు, డ్యామ్ పైభాగం, ఉద్యానవనం ప్రదేశాలను డాగ్ స్క్వాడ్ సహాయంతో తనిఖీలు నిర్వహించారు. పేలుడు పదార్థాలను గుర్తించే ప్రత్యేక జగిలాంతో సహా బాంబ్ డిస్పోజల్ టీమ్ ప్రతి మూలను పరిశీలించారు. ప్రజలు తరచూ సందర్శించే ప్రదేశమై ఉండటంతో ముందస్తు చర్యలు తీసుకున్నారు. అలాగే, స్థానిక భక్తులు అధిక సంఖ్యలో వచ్చే వెంకటేశ్వర స్వామి గుడి ప్రాంగణం, పార్కింగ్ ప్రాంతాలు, దేవస్థాన పరిసరాల్లోనూ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఆలయ చుట్టుపక్కల ఉన్న ఏరియాలు వరకు డాగ్ స్క్వాడ్‌తో పరిశీలించారు. పోలీసులు ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటారని, ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని ఎస్ఐ వెంకట సూర్య కోరారు. ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు లేదా వాహనాలు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని లేదా డయల్ 112 కాల్ చేయాలని సూచించారు. జిల్లాలో శాంతి భద్రతలు కాపాడేందుకు, నేర నియంత్రణ చర్యలను మరింత పటిష్ఠం చేసేందుకు జిల్లా పోలీస్ శాఖ నిరంతర పర్యవేక్షణ ఉంటుందని, ప్రజల భద్రతే తమ ప్రధాన ప్రాధాన్యమన్నారు. ఈ తనిఖీలలో పోలీసు సిబ్బంది ఉన్నారు.

తనిఖీ చేస్తున్న ఎస్ఐ వెంకట సూర్య

చిత్తడిగా మారిన రోడ్డు

చిన్నవానకే చిత్తడి

అధ్వానంగా అంతర్గత రహదారులు

ప్రజాశక్తి-పామూరు : చిన్నపాటి వర్షం పడినా అంతర్గత రోడ్లు అధ్వానంగా మారి గ్రామస్తులు నడవడానికి ఇబ్బందిపడుతున్నారు. ఆదివారం కురిసిన వర్షానికి పట్టణంలోని టీవీ పాలెంలో షేక్ మస్తాన్ ఇంటి ముందు సీసీ రోడ్డు లేక చిన్నపాటి వర్షానికి చిత్తడిగా మారింది. ఈ రోడ్డుపై నడవడానికి కూడా ఇబ్బందిగా ఉందని ఐద్వా జిల్లా నాయకులు సయ్యద్ షమీ తెలిపారు. ఈ ప్రాంతంలో ఉన్న అధికార పార్టీ నాయకులు పట్టించుకోలేదని ఆమె ఆరోపించారు. అధికారులు స్పందించి సిసి రోడ్లు వేసి ప్రజల సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో వరి నాట్లు వేస్తామని తెలిపారు. ఆమె వెంట ధనలక్ష్మి, శివకుమారి, ప్రభావతి తెలిపారు.

కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

పెంచలయ్య హంతకులను కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి-కనిగిరి : నెల్లూరులో ప్రజానాట్యమండలి యువ కళాకారుడు, మాజీ డివైఎఫ్ఐ నాయకులు సిపిఎం కార్యకర్త అయిన పెంచలయ్య మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని, గంజాయి డ్రగ్స్ నిర్మూలించాలని కనిగిరి పట్టణంలో ఎస్ఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ మాజీ నాయకులు పిసి కేశవరావు మాట్లాడుతూ పెంచలయ్య నెల్లూరు నగరంలోని ఆర్టీడీ కాలనీలో నివాసం ఉంటూ అక్కడ ఉన్న ప్రజలను డ్రగ్స్, గంజాయికి వ్యతిరేకంగా తన కళారూపాల ద్వారా చైతన్య పరుస్తున్నారని అలాంటి వ్యక్తిని అతి కిరాతకంగా నడిరోడ్డుపై వారి పిల్లల ముందే చంపడం దుర్మార్గమన్నారు. గంజాయి, డ్రగ్స్ యువత జీవితాలను నాశనం చేస్తున్నాయని, రాష్ట్రంలో విచ్చలవిడిగా గంజాయి డ్రగ్స్ విక్రయాలు జరుగుతున్నాయని దీనికి ప్రభుత్వం, పోలీసుల మద్దతు కూడా ఉందని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరస్వామి, ఐద్వా కనిగిరి పట్టణ కార్యదర్శి ప్రసన్న, డివైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు పి.నరేంద్ర, నాయకులు చెన్న కేశవులు, జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసరెడ్డి, సిఐటియు నాయకులు హజరత్, ప్రసంగి, ఏడుకొండలు, టోపేవలి, షమీనా, తిరుపతమ్మ, ప్రమీలా, లక్ష్మీదేవి, ఏలిసమ్మ, రత్తమ్మ పాల్గొన్నారు.

మెప్మాలో అవినీతి దొంగలను వదలం

ప్రెస్‌మీట్‌లో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల

త్వరలో మెప్మాలో అవినీతి దొంగల భరతం పడతామని ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్ధన్ మరో మారు స్పష్టం చేశారు. ఆదివారం ఒంగోలు మండలంలో జరిగిన కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ మెప్మాలో తారా స్థాయిలో అవినీతి జరిగిందని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారాయణ దృష్టికి తీసుకెళ్లి కమిటీని వేయించినట్లు తెలిపారు. అదే విధంగా కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లానని, వారు ప్రత్యేక కమిటీని వేసి విచారణ చేయిస్తున్నట్లు తెలిపారు. తాను కూడా అంతర్గతంగా విచారణ చేయిస్తునట్లు పేర్కొన్నారు. 10 రోజుల్లో విచారణ పూర్తి అవుతోందని, త్వరలోనే అసలు దోషులను బయటకు లాగుతామని స్పష్టం చేశారు. అధికారులు ఉంటే సస్పెండ్ చేయిస్తామని, అధికార పార్టీ వాళ్ళు ఉంటే అరెస్టు చేస్తామని తెలిపారు. ఈ విషయాన్ని రాజకీయం చేయవద్దని హితవు పలికారు. గత ఐదేళ్ల పాలనలో మెప్మాలో జరిగిన అవినీతి, ప్రస్తుత జరిగిన అవినీతిని పూర్తి స్థాయిలో విచారణ జరగుతోందని తెలిపారు.

ఉపాధ్యాయుడి మృతికి సంతాపం

ప్రజాశక్తి-కొత్తపట్నం

మండలంలోని ఈతముక్కల ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న మతుకుమల్లి సురేష్ బాబు ఇటీవల యాక్సిడెంట్‌కు గురై గుంటూరు లలిత హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. ఈయన గతంలో పొదిలి, మర్రిపూడి మండలంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలలో పనిచేసి 2025 బదిలీలలో ఈతముక్కలకు వచ్చారు. ఈతముక్కల హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు చెంచుపున్నయ్య, పలువురు ఉపాధ్యాయులు సురేష్ బాబు మృతికి సంతాపం తెలియజేశారు.

హంతకులను శిక్షించాలి

పెంచలయ్య హత్యపై నిరసన ర్యాలీలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె ధనలక్ష్మి

పెంచలయ్య హత్యకు బాపట్లలో సిఐటియు నిరసన

ప్రజాశక్తి - బాపట్ల

నెల్లూరులో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా వివిధ కళా రూపాలతో ప్రజలను చైతన్య పరుస్తున్న యువ కళా కారుడు పెంచలయ్యపై కత్తులతో వెంటాడి దారుణంగా హత్య చేయడం హేయమైన చర్యని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె ధనలక్ష్మి అన్నారు. సిఐటియు ఆధ్వర్యంలో పెంచలయ్య హత్యను ఖండిస్తూ ఆయన చిత్రపటంతో పాత బస్టాండు సెంటర్లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలతో కలిసి వస్తున్న పెంచలయ్యను నడిరోడ్డుపై కత్తులతో వెంటాడి కిరాతకంగా హత్య చేయడం పిరికి పంద చర్యగా పేర్కొన్నారు. ఒక పథకం ప్రకారం గంజాయి ముఠా చేసిన దాడిలో ప్రజా నాట్య మండలి కళాకారుడు, డివైఎఫ్ఐ మాజీ నేత, సిపిఎం కార్యకర్త కె పెంచలయ్య (37) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడని అన్నారు. ఈ హత్యను సిఐటియు జిల్లా కమిటీతో పాటు, ప్రజా సంఘాలు తీవ్రంగా ఖండించాయని అన్నారు. హత్యకు కారకులను గుర్తించి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఎలక్ట్రిషియన్‌గా పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్న పెంచలయ్య నెల్లూరు రూరల్‌లో ప్రజానాట్య మండలి కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారని తెలిపారు. నెల్లూరు నగరంలో ఇటీవల విచ్చలవిడిగా పెరిగిన గంజాయి సంస్కృతికి వ్యతిరేకంగా ఆయన ప్రజలు, యువతను చైతన్య పర్చడానికి అనేక కళారూపాలు రూపొందించి ప్రదర్శించారని అన్నారు. పోలీసుల సహకారంతో కూడా కొన్ని కార్యక్రమాలు చేశాడని తెలిపారు. గంజాయి మానండంటూ స్థానికంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారని తెలిపారు. ఇది స్థానిక గంజాయి ముఠాకు మింగుడు పడలేదని అన్నారు. దీంతో కొంతకాలంగా ఆయన కదలికలపై నిఘా వేసిన ఆ ముఠా పకడ్బందీగా ఓ పథకం రూపొందించి హత్య చేశారని ఆరోపించారు. పోలీసులపైనే కత్తులతో దాడి చేసిన పరిస్థితి రాష్ట్రంలో నెలకొన్నదన్నారు. పోలీసులకే రక్షణ లేనప్పుడు ప్రజలకు ఈ ప్రభుత్వం ఎలా రక్షణ కల్పిస్తుందని ప్రశ్నించారు. సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం వసంతరావు, సిహెచ్ మజుందర్, చేతి వృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ పి కొండయ్య, సిహెచ్ మణిలాల్, శామ్యూల్, లక్ష్మణరావు, జి సుధాకర్, ఝాన్సీ, వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

చీరాల : నెల్లూరు జిల్లాలో గంజాయి, మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన కల్పిస్తూ వివిధ కళారూపాలతో చైతన్యం నింపిన యువ కళాకారుడు, సీపీఎం కార్యకర్త, డివైఎఫ్ఐ నాయకుడు కామ్రేడ్ పెంచలయ్యను హత్య చేసిన హంతకులను కఠినంగా శిక్షించాలని కోరుతూ పట్టణంలో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, ప్రజా నాట్య మండలి ఆధ్వర్యంలో క్యాండిల్ ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం కార్యదర్శి ఎన్ బాబురావు మాట్లాడుతూ చీరాలలో కూడా గంజాయి మాఫియా అత్యాచారం, హత్యకు పాల్పడిన ఘటన గుర్తు చేశారు. పెంచలయ్య హత్య కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిందితులకు కఠిన శిక్షలు విధించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కన్వీనర్ బూదాటి వెంకట్‌కుమార్, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం వసంతరావు, జి బాలకృష్ణ, డి నారపరెడ్డి, జి ఇమ్మానియేల్, జి క్రాంతి సాగర్, కె నీలాంబరం, ఎస్ఎఫ్ఐ నాయకులు ఎన్ సూర్యకుమార్, పి శ్రీనివాసరావు, బి అబ్రహం, ఎస్‌కె జిలానీ, దేవర వెంకటేశ్వర్లు, శేషయ్య పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో చీరాలలో ర్యాలి చేస్తున్న నాయకులు

మాట్లాడుతున్నా జెసి భావన

అధికారులు అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి - వేమూరు

మండలంలోని జంపని గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంను జెసి భావన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేమూరులోని రైస్ మిల్లులు టార్గెట్ పూర్తయినందన జంపనీ రైతులను అమర్తలూరులోని రైస్ మిల్లులకు ట్యాగ్ చేస్తామని అన్నారు. రైతులు కొనుగోలు ట్రక్ సీటు జనరేట్ చేయాలంటే అమర్తలూరు ఇష్టమైతే కొనుగోలు చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో రేపల్లె ఆర్డిఓ రామలక్ష్మి, తహశీల్దారు సుశీల, ఎఒ గల్లా ప్రేమ సాగర్, ఆర్ఐ, విఎఎలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అంజుమన్ కమిటీ అధ్యక్షులు రహీం జానీ

స్మశానవాటిక ప్రహరీ నిర్మాణం

ప్రజాశక్తి - బాపట్ల

పట్టణంలో జమేదారుపేట స్మశాన వాటిక ప్రహరీగోడ నిర్మాణానికి రూ.6 లక్షలు నిధులు మంజూరు చేయించి అభివృద్ధికి కృషి చేసిన శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మకు అంజుమన్ ఎ ఇస్లామియా కమిటీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. పాత బస్టాండ్ వద్ద మసీదు ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అంజుమన్ కమిటీ అధ్యక్షులు అబ్దుల్ రహీమ్ జానీ మాట్లాడారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పడిపోయిన జమీందారుపేట స్మశాన వాటిక ప్రహరీ గోడ నిర్మాణ పనులు చేపట్టాలని ఎమ్మెల్యే నరేంద్ర వర్మకు వినతి పత్రం అందించినట్లు తెలిపారు. స్పందించిన నరేంద్రవర్మ తక్షణమే ప్రహరీ నిర్మాణ పనులు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ జి రఘునాథరెడ్డిని ఆదేశించారని తెలిపారు. సమావేశంలో అంజుమన్ కమిటీ ఉపాధ్యక్షులు బాజీవలి, కార్యదర్శి అబ్దుల్ కరీం, కోశాధికారి మీరా సాహెబ్, సభ్యులు అబ్దుల్ సత్తార్, షేక్ మౌలాలి, షేక్ ఆదం, అబ్దుల్ మజీద్, కో ఆప్షన్ సభ్యులు షేక్ హనీఫ్ పాల్గొన్నారు.

పుట్టంరాజును సత్కరిస్తున్న దృశ్యం

పుట్టంరాజుకు ఘన సత్కారం

ప్రజాశక్తి - అద్దంకి

కళామిత్ర మండలి (తెలుగు లోగిలి) ఆధ్వర్యంలో జరిగిన 19వ వార్షికోత్సవ వేడుకలు, మండలి వెంకట కృష్ణారావు శతజయంతి ఉత్సవాల్లో భాగంగా ఒంగోలు ఆర్డీఒ కార్యాలయ ప్రాంగణంలోని ఎన్‌టిఆర్ కళాక్షేత్రంలో జాతీయ స్థాయి ప్రతిభా పురస్కారాలు ఘనంగా ప్రదానం చేశారు. దేశవ్యాప్తంగా ఎంపికైన 9మంది సాహితీ ప్రముఖుల్లో అద్దంకికి చెందిన కవి, గజల్ రచయిత, విశ్వావసు ఉగాది పురస్కార గ్రహీత పుట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తికి డాక్టర్ వంకాయలపాటి రామకృష్ణ స్మారక సాహితీ ప్రతిభా పురస్కారం అందజేశారు. సభకు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి, శాసన సభ్యులు దామచర్ల జనార్ధనరావు, అవనిగడ్డ ఎమ్మెల్యే, పూర్వ ఉపసభాపతి డాక్టర్ మండలి బుద్ధప్రసాద్ పాల్గొన్నారు. జాతీయ అధ్యక్షులు డాక్టర్ నూనె అంకమ్మరావు, సాహితీ కౌముదీ గౌరవాధ్యక్షులు వారణాసి రఘురామశర్మ, కార్యదర్శి కెవి పోలిరెడ్డి, సృజన అధ్యక్షులు గాడేపల్లి దివాకరదత్తు, పాలపర్తి జ్యోతిష్మతి, ధేనువకొండ సుబ్బయ్య తదితరులు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తికి అభినందనలు తెలిపారు.

సిఐటియు మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - బాపట్ల

విశాఖపట్నంలో జరిగే సిఐటియు అఖిల భారత మహాసభలు జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె ధనలక్ష్మి కోరారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య ప్రజా సంఘాల జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగిన మహాసభల పోస్టర్ ఆవిష్కరణ అనంతరం సిఐటియు జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్మికులను నష్ట పరిచే విధంగా కార్పొరేట్లకు మోడీ దేశాన్ని తాకట్టు పెడుతూ తెచ్చిన 4లేబర్ కోడ్లు రద్దు చేయలని డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వం సంపద సృష్టించే కార్మికులు, రైతాంగాన్ని మోసం చేస్తూ కార్పొరేట్లకు దేశాన్ని తాకట్టు పెడుతున్నారని విమర్శించారు. విశాఖపట్నంలో ఈ డిసెంబర్ 31 నుండి 2026 జనవరి 3 వరకు మొట్ట మొదటిసారి సిఐటియు అఖిల భారత మహాసభలు రాష్ట్రంలో జరుగుతున్న సందర్భంగా దేశవ్యాప్త కార్మిక సమస్యలపై చర్చిస్తారని తెలిపారు. రాష్ట్రంలో కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలపైన పోరాటాలు రూపొందిస్తామని అన్నారు. స్వాతంత్ర్యం ముందు నుంచి కార్మికవర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలు మార్పులు చేసి కార్పొరేట్ పరిశ్రమ అధిపతులకు కార్మికవర్గాన్ని బానిసలుగా మారుస్తూ హక్కులకు తూట్లు పొడుస్తున్నారని అన్నారు. చట్టపరంగా సమ్మె చేసినప్పటికీ 8రోజులు వేతనం కోత కోయడం, సమ్మెలకు యాజమాన్యం అనుమతి ఉండాలని, పోరాడి సాధించుకున్న 8 గంటల పనిని 12 గంటలకు మార్పు చేస్తున్నారని అన్నారు. మహిళలను రాత్రిపూట పని చేయించేలాగా మార్పు చేశారని అన్నారు. రాజ్యాంగం ద్వారా స్వతంత్రంగా పనిచేయాల్సిన ఎన్నికల సంఘంను తమ ఆధీనంలో పెట్టుకుని, రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ అధికారంలో ఉండి కార్మిక, కర్షక, రైతాంగ వ్యతిరేక విధానాలు ఆలంబిస్తున్న మోడీ ప్రభుత్వానికి భవిష్యత్తులో కార్మికవర్గం బుద్ధి చెబుతుందని అన్నారు. సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం వసంతరావు, కార్యదర్శి సిహెచ్ మజుందార్, సిఐటియు జిల్లా నాయకులు సిహెచ్ మణిలాల్, టి వెంకటేశ్వర్లు, పి మనోజ్, కె శరత్ బాబు, కె ఝాన్సీ, ఎం శారద, ఇమ్మానుయేలు, కె వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సిఐటియు మహాసభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

తుపాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

మంత్రి గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి - అద్దంకి

దిత్వా తుఫాన్ ప్రభావంతో జిల్లాలో ఆదివారం నవంబర్ 30, డిసెంబర్ 1న గాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశాలున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ సూచించారు. తుఫాన్ ప్రభావంతో ప్రాణ, ఆస్తి నష్టాలు సంభవించకుండా అధికారులు సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని అన్నారు. జిల్లాలోని తీర ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలను ముందుగా సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని, నదీ పరివాహక గ్రామాల్లో పోలీసు, రెవెన్యూ, మత్స్య శాఖల అధికారులు, సచివాలయం సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రమాదకర పర్యాటక ప్రాంతాలను తాత్కాలికంగా మూసి వేయాలని అధికారులను ఆదేశించారు.

మంత్రి జి రవికుమార్

రేపల్లె : తుఫాను హెచ్చరికల నేపథ్యంలో తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిఎస్పి ఆవుల శ్రీనివాసరావు తెలిపారు. తుఫాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు పోలీసు యంత్రాంగం సిద్ధంగా ఉండాలని అన్నారు. రేపల్లె, నగరం, నిజాంపట్నం మండలాలపై తుఫాను ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉందన్నారు. గత అనుభవాలు దృష్టిలో ఉంచుకొని ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. మత్స్యకారులు వేటకు వెళ్లవద్దన్నారు.



మాట్లాడుతున్న ఏఐసిసి పరిశీలకులు

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి

ప్రజాశక్తి - పర్చూరు

కాంగ్రెస్ బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని మహారాష్ట్ర ఏఐసీసీ పరిశీలకులు షారద్ అహర్ కోరారు. స్థానిక మహాలక్ష్మి కాంప్లెక్స్ సమావేశం హాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయాల్లోకి యువతను ప్రోత్సహించేందుకు కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలని సూచించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేటట్లు చూడాలని చెప్పారు. సమస్తాగత ఎన్నికల్లో భాగంగా డిసిసి అభ్యర్థి ఎంపికకు అభిప్రాయ సేకరణ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్చార్జ్ నల్లగొర్ల శివజ్యోతి, జి పాల్ విజయ్, పోతిన సంపత్ కుమార్, పేరిరెడ్డి, ఎన్ వెంకటరామరాజు పాల్గొన్నారు.

ధ్రువపత్రాలు అందజేస్తున్న బట్ట జ్యోత్స్న

విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి - భట్టిపోలు

సమగ్రశిక్షా ఆదేశాల మేరకు జిల్లా స్థాయి ఐఈడి కో ఆర్డినేటర్ మట్టా జ్యోత్స్న ఆధ్వర్యంలో ఎంఇఒలు పులి లాజరు, నీలం దేవరాజు అనుమతితో జిల్లా స్థాయి ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు ఆటల పోటీలు శనివారం బాపట్ల మున్సిపల్ హైస్కూలు ఆవరణలో నిర్వహించారు. పోటీలకు మండలం నుండి ఈమని సందీప్ రన్నింగ్‌లో ద్వితీయ, ఆకురాతి యోగేష్ అనంత్ లాంగ్ జంప్‌లో ప్రథమ, అమర్తలూరి సుశాంత్ షార్ట్ పుట్‌లో ద్వితీయ స్థానం కైవసం చేసుకొన్నారు. బాలికల విభాగం నుండి సిరిబోయిన దివ్య షార్ట్ పుట్‌లో ద్వితీయ స్థానం సాధించారు. ఈ సందర్భంగా డిఈఓ శ్రీరాముల పురుషోత్తం మాట్లాడుతూ ఈ ఆటల పోటీలు చిన్నారుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంచుతాయని అన్నారు. కార్యక్రమంలో ఐఈడి టీచర్స్ కె రత్నాకర్, డి మేరీ ఇవాంజలిన్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
సోమవారం 1 డిసెంబర్ 2025

మిర్చి పంట

మిర్చి రైతుకు నష్టాల మంట.!

- లక్షలాది రూపాయలు ఖర్చు పెట్టినా ఉపయోగం లేని వైనం..
- నల్ల తామరతో ఆందోళన

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

మిర్చి రైతుకు నష్టాల భయం వెంటాడుతోంది. మిరప రైతులు మండలంలో ఎప్పటిలాగానే ఖరీఫ్ సీజన్లో మిరప పంటను వేశారు. మండలంలో మిరప పంట దాదాపుగా 4 వేల ఎకరాల వరకు ఉంటుంది. ఈ ఏడాది తుఫాను ప్రభావంతో నష్టపోయిన రైతులు తిరిగి పంట కోలుకునే సమయానికి నల్ల తామరపై ముడత వైరస్ సోకడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఒక ఎకరాకు ఇప్పటికి లక్ష రూపాయలకు పైగా పెట్టుబడి దాటిందని రైతుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు 25 నుంచి 30 క్వింటాళ్ల వరకు దిగుబడి రావలసి ఉండడగా.. 10 క్వింటాళ్లు అయినా, వస్తుందో.. రాదో అని రైతులు ఆందోళన చేస్తున్నారు. నల్ల తామర తగ్గడం లేదని రైతులు వాపోతున్నారు. అటు తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న రైతులు మరోమారు తుఫాన్ హెచ్చరికతో ఇంకా నష్టపోయే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు.

రూ.5 లక్షల పెట్టుబడి పెట్టా..

చిట్యాల శ్రీనివాస్‌రెడ్డి, రైతు, అయినముక్కుల

ఈ సంవత్సరం మిరప పంట ఆశాజనకంగా ఉంటుందని ఐదు ఎకరాలు వేశా.. అటు తుఫాన్ ప్రభావం, ఇటు నల్ల తామర ప్రభావంతో ఆందోళన చెందుతున్నాం.. రూ.ఐదు లక్షల వరకు పెట్టుబడి పెట్టాం. పెట్టుబడి అయినా వస్తుందో.. రాదో..?

ప్రభుత్వమే ఆదుకోవాలి..

ఏ.రమణారెడ్డి, రైతు, పెద్దబొమ్మలాపురం

మిరప పంట, అరటి ఐదు ఎకరాల వరకు వేశాం..పెట్టుబడి భారీగా అయింది. నల్ల తామర ముడత, భారీ వర్షాల దెబ్బకు తీవ్రంగా నష్టపోయాం. ప్రభుత్వమే ఆదుకోవాలి.

సూర్యలంక బీచ్ తాత్కాలిక మూసివేత

ప్రజాశక్తి-బాపట్ల

దిత్వా తుపాను కారణంగా సూర్యలంక బీచ్‌కు పర్యాటకులను అధికారులు అనుమతించలేదు. ఆదివారం సెలవు దినం కావడంతో పెద్ద సంఖ్యలో రెండు తెలుగు రాష్ట్రాల నుండి పర్యాటకులు సూర్యలంక బీచ్‌లో సముద్ర స్నానాలు ఆచరించేందుకు ప్రత్యేక వాహనాలతో పాటు రైలు మార్గం ద్వారా బాపట్లకు చేరుకున్నారు. అయితే అకస్మాత్తుగా వాతావరణ శాఖ దిత్వా తుపాను పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రకటించడంతో అప్రమత్తమైన పోలీసు, రెవెన్యూ, మెరైన్ విభాగాల అధికారులు పర్యాటకులను సూర్యలంక బీచ్‌కు అనుమతించలేదు. దీంతో పర్యాటకులు వెనుతిరిగి వెళ్లాల్సి వచ్చింది. దీని ప్రభావం నవంబర్ 5 వరకు ఉండవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో సూర్యలంక బీచ్‌కు పర్యాటకులు అనుమతించే అంశాన్ని ప్రకటించే వరకు పర్యాటకులు సూర్యలంక బీచ్ కు రావద్దని బాపట్ల ఆర్డీవో గ్లోరియా తెలిపారు. ఆదివారం పర్యాటకులతో కళకళలాడాల్సిన సూర్యలంక బీచ్ తుపాను కారణంగా వెలవెలబోతోంది.

నేడు పిజిఆర్ఎస్ రద్దు

జిల్లాలో దిత్వా తుఫాన్ వల్ల భారీవర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో జిల్లా కలెక్టరేట్ లో సోమవారం నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)ను రద్దు చేసినట్లు కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఎవ్వరూ అర్జీలిచ్చేందుకు రావొద్దని కోరారు.

నేడు మాగుంట సుబ్బరామరెడ్డి వర్ధంతి

ఏర్పాట్లు పరిశీలించిన ఎంపీ మాగుంట

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు మాజీ పార్లమెంట్ సభ్యులు, కీర్తిశేషులు మాగుంట సుబ్బరామరెడ్డి 30వ వర్ధంతి కార్యక్రమం సోమవారం జరగనుంది. ఒంగోలు పివిఆర్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో సంస్మరణ కార్యక్రమం, అన్న సంతర్పణ కార్యక్రమాలను కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. మాగుంట సుబ్బరామరెడ్డి వర్ధంతి సందర్భంగా భారీ ఏర్పాట్లు చేశారు. తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో వర్ధంతి కార్యక్రమంలో పాల్గొనే ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా రెయిన్ ప్రూవ్ టెంట్లు వేశారు. ఒంగోలు పివిఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో వర్ధంతి కార్యక్రమం ఏర్పాట్లును ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఆయన తనయుడు, యువ నాయకులు మాగుంట రాఘవ రెడ్డి ఆదివారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా వీరు సంస్మరణ సభ జరిగే వేదికను, వంట శాలలను, కూరగాయలు, మిఠాయిలు తయారు చేసిన గదులను పరిశీలించారు. ఒంగోలు ఎంపి

ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీ మాగుంట

మాగుంట శ్రీనివాసులు రెడ్డి స్వయంగా మిర్చి బజ్జీలను వేయించటం విశేషం. కార్యక్రమంలో మాగుంట శ్రీనివాసులు రెడ్డి కుమారుడు, యువ నాయకులు మాగుంట నిఖిల్ రెడ్డి, ఒంగోలు నగర డిఎస్‌పి రాయపాటి శ్రీనివాసరావు, ఒంగోలు నగర పాలక సంస్థ కమిషనర్ డాక్టర్ కోడూరి వెంకటేశ్వరరావు, మాగుంట అభిమానులు అయినాబత్తిన ఘనశ్యామ్, బెల్లం సత్యనారాయణ, ఆత్మకూరి బ్రహ్మయ్య, పిడిసిసి బ్యాంకు మాజీ ఛైర్మన్ కండే శ్రీనివాసులు, కోలా ప్రభాకర్, శ్రీనివాసరావు, షేక్ అన్వర్ పాల్గొన్నారు.

లేబర్ కోడ్స్

రద్దయ్యే వరకూ పోరాటం

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

కార్పొరేట్ ప్రయోజనాల కోసం కార్మికుల హక్కులను తుంగలో తొక్కే లేబర్ కోడ్స్ రద్దు అయ్యేంతవరకు జిల్లా కార్మికవర్గం విస్తత ఐక్యపోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు జివి కొండారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం జరిగిన సిఐటియు జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో కొండారెడ్డి మాట్లాడుతూ యూనియన్లను అరికట్టే ఉద్దేశంతో 100 మంది కార్మికులు లేదా మొత్తం కార్మికులలో 10 శాతం అంగీకారం తప్ప యూనియన్ నమోదు కాకుండా చేసిన నిబంధనలు కార్మిక హక్కులపై గొడ్డలిపెట్టని పేర్కొన్నారు.సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యం రమేష్ మాట్లాడుతూ, రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం కార్మికుల పట్ల వ్యతిరేక వైఖరితో 13 గంటల పనిగంటలు అమలు చేసి, లేబర్ కోడ్స్ అమలుకు మరింత వేగం

మాట్లాడుతున్న జివి.కొండారెడ్డి

పెంచిందని దునుమాడారు. జిల్లాలో ఎ.యం.ఆర్‌కు ఇచ్చిన అనుమతులను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి, జి శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షులు పికల్పన, డి.కె.యం. రఫీ, బంకా సుబ్బరావు, పల్లాపల్లి ఆంజనేయులు, టి. ఆవులయ్య, టి. రాము, టి. మహేష్, జి. రమేష్, పి. రూబెన్, కొర్నెపాటి శ్రీనివాసరావు, రాయల మాలకొండయ్య, ఉబ్బా ఆదిలక్ష్మి, యస్.కె. అన్వర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

అవగాహనే అసలు మందు.!

- పెరిగిన చైతన్యం
- తగ్గుతున్న హెచ్ఐవి కేసులు
- నేడు ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

హెచ్ఐవి/ ఎయిడ్స్‌పై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్ట చర్యలు చేపట్టాయి. ప్రజలలో అవగాహన కలిగించటమే వ్యాధి నివారణ ప్రధాన మార్గమని గ్రహించాయి. కేంద్రంలోని వైద్య, ఆరోగ్య మంత్రిత్వ శాఖ, రాష్ట్రంలో వైద్య ఆరోగ్య శాఖ చూపుతున్న చొరవతో ప్రజలలో వ్యాధి పట్ల చైతన్యం పెరిగింది. తద్వారా జిల్లాలో ప్రతి ఏటా నమోదవుతున్న ఎయిడ్స్ కేసుల సంఖ్య తగ్గుతోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనలతో ఈ ఏడాది 'హెచ్ఐవి పరీక్ష చేయించుకోండి, సమాచారం తెలుసుకోండి – సురక్షితంగా ఉండండి" నినాదంతో ఎయిడ్స్ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం, నివారణ చర్యలపై ప్రత్యేక కథనం..

ప్రపంచంలో 1988లో తొలి ఎయిడ్స్ కేసు నమోదైంది. ప్రతి సంవత్సరం డిసెంబర్ 1న ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవంగా పాటిస్తున్నారు. హెచ్ఐవి తో జీవిస్తున్న ప్రజలకు మద్దతు తెలియజేయడానికి, హెచ్ఐవి / ఎయిడ్స్‌తో జీవిస్తున్న వారికి సంఘీభావాన్ని చూపడానికి, మరణించిన వారిని స్మరించుకోవడానికి దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ప్రకాశం జిల్లాలో 13,406 మంది హెచ్ఐవి బాధితులు ఉన్నారు.

జిల్లాలో హెచ్ఐవి/ఎయిడ్స్ గణాంకాలు

ప్రకాశం జిల్లాలో ప్రస్తుతం 10 ఐసిటిసిలు (ఇంటిగ్రేటెడ్ కౌన్సెలింగ్ టెస్టింగ్ సెంటర్), 2 ఏఆర్‌టి కేంద్రాలు (యాంటీరెట్రో వైరల్ థెరపీ),

5 టిఐ ఎన్జీవోలు 9 బ్లడ్ బ్యాంకులు, 3 డిఆర్ఆర్‌సి కేంద్రాలు, ఒక సిఎస్‌సి కేంద్రం (కేర్ సపోర్ట్ సెంటర్), 6 ఎఫ్‌టిఎస్ (లింక్ వర్కర్ పథకం), ఒక మొబైల్ కేంద్రం ద్వారా రోగులకు సేవలందుతున్నాయి. 2025 ఏప్రిల్ నుండి అక్టోబర్ 2025 వరకు సాధారణ జనాభాలో 59,612 మందికి హెచ్ఐవి పరీక్ష చేయగా, 336 మందికి హెచ్ఐవి పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. వ్యాప్తి 0.56 శాతంగా ఉంది. 2017-18 లో 92014 మందికి హెచ్ఐవి పరీక్ష చేయగా, 2086 (2.26%) మందికి హెచ్ఐవి పాజిటివ్ నిర్ధారణ అయింది.

అవగాహన కార్యక్రమాలు:

హెచ్ఐవి/ ఎయిడ్స్‌పై హోర్డింగ్స్, గోడ రాతలు, కళా జాతాలు, కరపత్రాలు, పోస్టర్లు, రేడియో ద్వారా ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పోలీస్ శాఖ, డ్వాక్రా/మెప్మా బందాలు, పరిశ్రమలు, అంగన్వాడీ ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు, ఎన్‌వైకె (నెహ్రూ యువ కేంద్రం) వలసదారులకు అవగాహన సమావేశాలు నిర్వహించారు. అన్ని ప్రభుత్వ కళాశాలల్లోని రెడ్ రిబ్బన్ క్లబ్స్ ద్వారా వ్యాధిపై అవగాహన కలిగిస్తున్నారు. ఆటో డ్రైవర్లు, ట్రక్ డ్రైవర్లకు హెచ్.ఐ.వి / ఎయిడ్స్ పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఇంటెన్సిఫైడ్ ఐఈ.సి. (సమాచార, విద్య, కమ్యూనికేషన్) ప్రచారం కార్యక్రమం ద్వారా 199 గ్రామాలు, 109 పాఠశాలలు, 70 కళాశాలలు, 1559 గహాలలో వ్యాధి అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

ఎయిడ్స్ నివారణలో భాగస్వాములవ్వాలి..

- డాక్టర్ జి.బాలాజీ, జిల్లా క్షయనివారణ, ఎయిడ్స్ నియంత్రణ అధికారి

ఎయిడ్స్ నివారణలో ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలతో పాటు ప్రజలు భాగస్వాములు కావాలి. వివిధ ఎన్జీవోలు, రెడ్ రిబ్బన్ క్లబ్స్, ప్రభుత్వ అధికారులు, ఇతర సంఘాల ద్వారా ప్రజలలో అవగాహన కలిగిస్తున్నాం. అన్ని శాఖల సహకారంతో ఎయిడ్స్ వ్యాధి నివారణకు చర్యలు చేపడతాం.

నేడు ఒంగోలులో ర్యాలీ

ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ఒంగోలు నగరంలో ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ ర్యాలీని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి ప్రారంభించనున్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ రాజాబాబు ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన దిత్వా తుపాన్ వాయుగుండం ప్రభావంతో జిల్లాలో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. ఆదివారం ఉదయం కలెక్టర్ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి దిత్వా తుపాన్ సందర్భంగా చేపట్టవలసిన ముందస్తు ఏర్పాట్లుపై మండలాల వారీగా, శాఖల వారీగా సమీక్షించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 14 మండలాల్లో 168 గ్రామాల్లో దిత్వా తుపాన్ ప్రభావం ఉండే అవకాశం ఉందని అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాలో వరి కోత సీజన్ ప్రారంభం అయినందున తుఫాన్ ప్రభావం తగ్గేవరకు వరి కోతలు కోయకుండా క్షేత్ర స్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులు, రైతులకు తెలియజేయాలని తెలిపారు.

మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

భారీ వర్షాల దృష్ట్యా ప్రజలకు అత్యవసర సేవలు అందించేందుకు ఒంగోలు కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. ఆదివారం నాడు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 24 గంటలు కంట్రోల్ రూమ్ నెంబర్ 08592-281400 ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా తక్షణమే సంప్రదించవచ్చన్నారు. జిల్లా అత్యవసర ఆపరేషన్ కేంద్రం టోల్-ఫ్రీ నంబర్ 1077 ను సంప్రదించవచ్చన్నారు.

క్యాండిల్ ర్యాలి నిర్వహిస్తున్న హెల్ప్ సంస్థ ప్రతినిధులు

అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - అద్దంకి

హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాధితో అకాల మరణం చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ టిఐ బివి సాగర్ పేర్కొన్నారు. డిసెంబర్ 1న అంతర్జాతీయ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా స్థానిక గుర్రాల కాలనీలో క్యాండిల్ లైట్ ర్యాలీ నిర్వహించారు. ఐసిటిసి కౌన్సిలర్ రమేష్ మాట్లాడుతూ హెచ్ఐవి, ఎయిడ్స్‌తో మరణించిన కుటుంబాలకు సంఘీభావం తెలపాలని కోరారు. అయినవాళ్లు కోల్పోయామనే మనోవేదనకు గురికాకుండా మనోధైర్యం కలిగించాల్సిన బాధ్యత మనపై ఉందని అన్నారు. హెచ్ఐవి, ఎయిడ్స్ జాతీయ టోల్ ఫ్రీ 10975, హెచ్ఐవి, ఎయిడ్స్ నియంత్రణ చట్టం 2017పై అవగాహన కలిగించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెల్ప్ సంస్థ పిఐ ప్రోగ్రాం మేనేజర్ బి దుర్గా సురేంద్ర, అద్దంకి అవుట్ రిచ్ వర్కర్స్ టి దుర్గా భవాని పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కూన్సిలింగు ఇస్తున్న డిఎస్‌పి శ్రీనివాసరావు

చట్ట వ్యతిరేక పనులు చేస్తే చర్యలు

ప్రజాశక్తి - రేపల్లె

రౌడీ షీటర్ల తీరు మారకుంటే పీడీ యాక్ట్ అమలు చేస్తామని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు హెచ్చరించారు. తన కార్యాలయంలో రౌడీ షీటర్లకు ఆదివారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఎస్పీ ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు రౌడీషీటర్ల ప్రవర్తనలో మార్పు తీసుకువచ్చేందుకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రౌడీషీటర్ల నేర చరిత్ర, వారిపై ఉన్న కేసుల వివరాలు, ప్రస్తుత జీవన విధానం, ఉద్యోగ స్థితిగతులు అడిగి తెలుసుకున్నారు. రౌడీ షీట్ ఉన్న వాళ్లు ఎలాంటి కేసుల్లోనైనగా తల దూర్చ వద్దని సూచించారు. ఎవరైన నేరాలకు పాల్పడితే జైలుకెళ్లతారని హెచ్చరించారు. గత పదేళ్లుగా ఎలాంటి నేరాల్లో లేని రౌడీషీటర్ల సత్ప్రవర్తన కలిగిన వ్యక్తులుగా గుర్తించి వారిపై రౌడీషీట్ తీసేసే ప్రయత్నం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ సీఐ మల్లికార్జునరావు, రూరల్ సీఐ సురేష్ బాబు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న కోళ్ల లారీ

ఆటోను ఢీకొన్న లారీ

ప్రజాశక్తి - చెరుకుపల్లి

ఎదురెదురుగా వస్తున్న కోళ్ల లారీ, ఆటో ఢీకొనడంతో నలుగురు ప్రయాణికులకు తీవ్ర గాయాల పాలైన సంఘటన ఆదివారం తెల్లవారు జామున చెరుకుపల్లి శివారులో తెనాలి రోడ్డులో జరిగింది. మండలంలోని కావూరు వినాయక ఆశ్రమానికి చెందిన కుంచాల శివారెడ్డి కుటుంబం తిరుపతి వెళ్లేందుకు రోడ్డు మార్గంలో తెనాలి వెళుతుండగా తాళ్లచెరువు సమీపంలో చెరుకుపల్లి వైపుకు వస్తున్న కోళ్ల లారీ ఢీ కొట్టింది. ప్రమాదంలో శివారెడ్డి భార్య కుంచాల వెంకటేశ్వరమ్మ, వారి కుమారుడు కోణాలరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. మరొక కుమారుడు గాయపడ్డాడు. క్షతగాత్రులను పొన్నూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, మరొకరిని తెనాలి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

గురజాడ, పూలేకు ఘన నివాళి

ప్రజాశక్తి - ముండ్లమూరు

మండలంలోని శంకరాపురంలోని భగత్ సింగ్ స్మారక గ్రంథాలయంలో మరో గ్రంథాలయ ఉద్యమంలో భాగంగా జన విజ్ఞాన వేదిక సౌజన్యంతో గురజాడ అప్పారావు, మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా వారి చిత్ర పటాలకు విద్యార్థినీ, విద్యార్థులతో నివాళులర్పించారు. జన్మదిన వేదిక జిల్లా ఎన్విరాన్మెంటల్ కన్వీనర్ మన్నం త్రిమూర్తులు మాట్లాడారు. గురజాడ అప్పారావు రచించిన దేశమంటే మట్టి కాదు, దేశమంటే మనుషులనే రచన ఆడియో సినీ పాటను సెల్ ద్వారా విద్యార్థులకు వినిపించారు. జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి తంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ నాటి సమాజంలో అనాగరికత, రుగ్మతులను రూపుమాపటానికి, మహిళలకు విద్య అవసరమని చైతన్యవంతం చేసి, సాహిత్యం, కళారూపాలతో ప్రజల్లో చైతన్యాన్ని నింపిన మహానుభావులను ఎప్పటికీ మరచిపోకూడదని అన్నారు. గురజాడ రచనల్లో 'కన్యాశుల్కం' సమాజంలో ఉద్యమ కెరటంలా ప్రజల్లో చైతన్యాన్ని నింపినదని అన్నారు. ఈ గ్రంథాలయ భవనం అద్దె లేకుండా అందజేసిన స్థానికులు మందలపు లక్ష్మీనారాయణను అభినందించారు. కార్యక్రమంలో గాలి వెంకటేశ్వర్లు (ఎర్రయ్య), గంగిశెట్టి శ్రీనివాసరావు, రమేష్, శ్రీను, శంకరాపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

సంతమాగులూరులో నివాళులర్పిస్తున్న దృశ్యం

సంతమాగులూరు : స్థానిక గ్రంథాలయం నందు గ్రంథ పాలకుడు బాదం విజయభాస్కరరెడ్డి ఆధ్వర్యంలో కన్యాశుల్కం నాటక రచయిత, అభ్యుదయ కవి గురజాడ అప్పారావు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. గురజాడ అప్పారావు కవిగా సమాజానికి చేసిన సేవలు కొనియాడారు. అనంతరం విద్యార్థులతో చదవటం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో విద్యుత్ లైన్ మెన్ ఎస్ హరిగోపాల్, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బెల్టుషాపుల దెబ్బకు బార్ మూసివేత

ప్రజాశక్తి - అద్దంకి

పట్టణంలో ఒక బార్ అండ్ రెస్టారెంట్‌కు ప్రభుత్వ అనుమతులు ఉన్నాయి. కానీ అనధికారికంగా రెస్టారెంట్లు మందు విక్రయిస్తుండటంతో బారుకు వెళ్లేవారు లేరు. తాము బార్ నడపలేమని అనుమతి పొందిన దుకాణం ముందు ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఎక్సైజ్ అధికారులు కొద్ది రోజుల క్రితం రెస్టారెంట్లో మందు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరికలతో గత 15 రోజులు తాత్కాలికంగా నిలిపివేశారు. తిరిగి మరల రెస్టారెంట్లలో మందు అమ్మకాలు జరపడంతో బార్ నిర్వాహకులకు కష్టతరంగా మారిందని నిర్వాహకులు వాపోతున్నారు. అధికారులకు ఎన్నిసార్లు సమస్య చెప్పుకున్నా పరిష్కారం కాకపోవడంతో తమ నడపలేమని ఫ్లెక్సీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

మూసేస్తున్నట్లు ప్రకటించిన బార్ యజమాని

రెస్టారెంట్లపై చర్యలు తీసుకుంటాం

బార్ అండ్ రెస్టారెంట్ నిర్వహణ కష్టంగా మారిందని నిర్వాహకులు బార్ వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేశారనే విషయంపై ఎక్సైజ్ సిఐ భవానిని వివరణ కోరగా తిరోజు పట్టణంలో రెస్టారెంట్లు వద్ద కానిస్టేబుల్ గస్తీ తిరుగుతున్నారని, తమ కృషి తాము చేస్తున్నామని తెలిపారు. అనుమత్తుల్లేని రెస్టారెంట్లలో ముందు విక్రయాలు జరిపితే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గుడ్ వాటర్ ఛానల్ అభివృద్ధికి వినతి

ప్రజాశక్తి - నిజాంపట్నం

స్థానిక గుడ్ వాటర్ ఛానల్ అభివృద్ధి చేయాలని కోరుతూ జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య ఆధ్వర్యంలో రైతులు టీడీపీ నేత అనగాని శివప్రసాద్‌కు ఆదివారం వినతి పత్రం అందజేశారు. పిట్టలవానిపాలెం నుండి నిజాంపట్నం వరకు ఉన్న పెద్ద కాలువ 15ఏళ్లుగా పూర్తిగా పూడికతో నిండిపోవడంతో నీరు దిగువకు చేరకుండా అవరోధం ఏర్పడుతోందని అన్నారు. నిజాంపట్నం లాకుల వద్ద జల్లెడ ఏర్పాటు చేసి ఛానల్‌లోకి తుక్కు రాకుండా చూడాలని కోరారు. నెంబర్1 డ్రెయిన్ వరకు ఇరు పక్కల గోడలు లేక నీరు పొర్లిపోతుందని, దీని నివారణకు గోడలు నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. చెట్లు, మొక్కలు తొలగించి కాలువ శుభ్రపరచాలని కోరారు. నెంబర్2 డ్రెయిన్ వద్ద పగిలిన గోడలు తొలగించి కొత్త గోడలు నిర్మించాలని కోరారు. మురుగు కాలువపై ఉన్న పాత బావులు తొలగించి పెద్ద తూములు ఏర్పాటు చేయడంతో పాటు దర్వేష్‌పాలెం మార్గంలోని బావులు కూడా తొలగించాలని రైతులు కోరారు. ముట్ల చెరువు వద్ద బండ్ల రాకపోకలకు వంతెన నిర్మించాలని అన్నారు. గుండం చెరువు నుంచి నెంబర్2 డ్రెయిన్ వరకు ఊడిపోయిన ఇటుకలు మరమ్మతు చేయాలని పేర్కొన్నారు. రేపల్లె ఆర్ అండ్ బీ రోడ్డు నుండి కాలువ చివరి వరకు లైనింగ్ అడుగున ఏర్పడిన గుంతలు రిపేర్ చేసి కాలువ పూర్తిగా పునరుద్ధరించాలని కోరారు. సమస్యను మంత్రి అనగాని సత్యప్రసాద్ దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు. రైతుల వెంట కృష్ణ పశ్చిమ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ పంతాన్ని మురళీధరరావు, కేసన రామకృష్ణ, నీటి సంఘం డీసీ చైర్మన్ మునాఫ్, డీసీ వైస్ చైర్మన్ పోలి రాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు నరేష్ యాదవ్ ఉన్నారు.

వినతి పత్రం అందజేస్తున్న జెడ్‌పిటిసి నర్రా సుబ్బయ్య

ఎఎంఆర్ చెక్‌పోస్టుపై దాడి కేసు నమోదు

ప్రజాశక్తి - బల్లికురవ

ప్రభుత్వం నుండి సీనరేజి హక్కులు పొంది చెక్ పోస్టుల ద్వారా గ్రానైట్ సీనరేజీ వసూలు చేస్తున్న ఎఎంఆర్ సంస్థ ప్రతినిధులు చెక్ పోస్టులను ధ్వంసం చేసిన ఘటనపై పిర్యాదు చేసినట్లు సమాచారం. శనివారం గ్రానైట్ ఫ్యాక్టరీ యూనియన్ అసోసియేషన్ అధ్యక్షుడు చిడిపోతు మస్తానయ్య ఆధ్వర్యంలో ప్రభుత్వానికి సీనరేజీ వసూలుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సిబ్బందిపై దాడి చేసి చెక్‌పోస్టులు ధ్వంసం చేసిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిసింది. మస్తానయ్య, అబ్బారెడ్డి, బ్రహ్మయ్య, ఆంజనేయులు, దొడ్డ అనిల్, మార్కర్ సురేష్, తాడిపర్తి గణేష్, మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

సమావేశంలో వైసిపి ఇన్‌ఛార్జి గాదె మధుసూదనరెడ్డి

వైసిపి బలోపేతానికి కృషి చేయాలి

ప్రజాశక్తి - పర్చూరు

నియోజకవర్గంలో వైసిపి బలోపేతానికి నూతనంగా నియమితులైన గ్రామ అధ్యక్షులు కృషి చేయాలని వైసిపి ఇన్‌ఛార్జి గాదె మధుసూదనరెడ్డి కోరారు. స్థానిక వైసిపి కార్యాలయంలో గ్రామ అధ్యక్షులతో పరిచయ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. 2029లో వైఎస్ జగన్మోహన రెడ్డిని ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. ప్రతి కార్యకర్త, నాయకుడు సమిష్టిగా కృషి చేయాలని అన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి 89వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేకు కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. అనంతరం ఆశ్రయ వృద్ధుల ఆశ్రమంలోని వృద్దులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వైసిపి పర్చూరు, కారంచేడు, చినగంజాం, ఇంకొల్లు, యద్దనపూడి కన్వీనర్లు కటారి అప్పారావు, జువ్వ శివరాం, నాగేశ్వరరెడ్డి, పూర్ణరావు, రావూరి వేణు బాబు, నాయకులు ముప్పాళ్ళ రాఘవయ్య, అనీలు, బండారు ప్రభాకరు, కె ఏడుకొండలు, జట్టి చంద్రం, కంచనపల్లి రమేషు, వై హరిప్రసాద్, ఎం బలరాం పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి - బల్లికురవ

జిల్లా కేంద్రమైన బాపట్ల మున్సిపల్ ఉన్నత పాఠశాల్లో సిడబ్ల్యూఎస్ఎన్ విద్యార్థులకు జిల్లా స్థాయి ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో చెన్నుపల్లికి చెందిన యాగంటి కవిత 400 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం, స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల రెండో సంవత్సరం చదువుచున్న కోవూరు అనురేఖ లాంగ్ జంప్‌లో, వెంకట సురేష్ బాబు షాట్‌పుట్‌లో తృతీయ స్థానం క్రైవసం చేసుకున్నారు. విజేతలకు ఆదివారం ప్రశంసా పత్రాలు అందజేశారు. ఎంఇఒ శ్రీనివాసరావు, రమేష్ బాబు, ఉపాధ్యాయులు నాజిని, నాగబాబు అభినందించారు.

బహుమతులు అందజేస్తున్న సిఐ సుబ్బారావు

మొబైల్‌కు బానిస కావొద్దు

ప్రజాశక్తి - చీరాల

నేటి సమాజంలో యువత మొబైల్ ఫోన్లను నిత్యం వాడుతూ సోషల్ మీడియాకు బానిసలై లక్ష్యాలు చేరుకోకుండా చెడు వ్యసనాలకు బానిసలై జీవితాలు నాశనం చేసుకుంటున్నారని పట్టణ సీఐ సుబ్బారావు అన్నారు. మిస్టర్ అండ్ మిసెస్ పెరిరాస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆధ్వర్యంలో నవంబర్ 28, 29 తేదీల్లో 3వ ఇంటర్ స్కూల్ టోర్నమెంట్స్ పోటీలు నిర్వహించారు. బాలికల కబడ్డీ, బాలుర క్రికెట్ పోటీలు ఆదివారం జరిగాయి. బాలికల కబడ్డీలో 8జట్లు పాల్గొన్నాయి. ఉత్కంఠ భరితంగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో విఠల్‌నగర్ ఎస్ఎఆర్ఆర్ఎం స్కూలు జట్టుతో తలపడిన పెరిరాస్ బాలికల జట్టు అద్భుత ప్రతిభ కనబరచి విజేతగా నిలిచారు. బాలుర క్రికెట్ టోర్నమెంట్‌లో 8జట్లు పోటీపడ్డాయి. ఫైనల్‌లో కొత్తపేట మదర్ తెరిసా స్కూల్ జట్టును పెరిరాస్ జట్టు ఓడించి ట్రోఫీ సొంతం చేసుకున్నారు. విజేతలకు ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో పెరిరా స్కూల్ కరస్పాండెంట్ జరార్డ్, ప్రిన్సిపాల్ సుప్రసన్న, వైస్ ప్రిన్సిపాల్ జయలక్ష్మి, పిఈటీ శాంతి వరప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
సోమవారం 1 డిసెంబర్ 2025
7

నల్లమడను పరిశీలిస్తున్న అధికారులు

వరదను ఎదుర్కొనేందుకు చర్యలు

ప్రజాశక్తి - బాపట్ల

దిత్వా తుఫాన్ ప్రభావంతో వరద తాకిడిని ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు ఆర్డిఓ గ్లోరియా తెలిపారు. జిల్లాకు ప్రమాదం పొంచి ఉన్న నేపథ్యంలో అప్పికట్ల ప్రాంతంలో నల్లమడ వాగును ఆమె డిఎస్పి రామాంజనేయులు, తహశీల్దారు సలీమాతో కలిసి పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు నల్లమడ వాగు తోపాటు పంట కాలువలు పరిశీలించారు. ఇటీవల మొంథా తుఫానుకు నల్లమడవాగు పొంగి కట్టలు తెంచుకున్న ప్రాంతాన్ని పరిశీలించారు. వర్షాలకు వరదలు సంభవించి సమస్యలు ఎదురైతే సత్వరమే చేపట్టాల్సిన చర్యలపై నీటిపారుదల, డ్రైనేజీ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధికారుల వెంట సర్వేయరు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

తిమ్మనపాలెంలో చోరీ

ప్రజాశక్తి - మేదరమెట్ల

ఆధారాలు సేకరిస్తున్న దృశ్యం

మండలంలోని తిమ్మనపాలెంలో నివాసం ఉంటున్న యనమల వెంకట రఘురామిరెడ్డి తన భార్యతో కలిసి తన అత్తగారి గ్రామమైన త్రోవగుంట వెళ్లి ఆదివారం ఉదయం వచ్చి చూడగా వెనుక తలుపులు పగలగొట్టి బీరువాలోని 10 సవర్ల బంగారు ఆభరణాలు దొంగిలించినట్లు ఆదివారం పోలీసు స్టేషన్లో పిర్యాదు చేశారు. స్థానిక ఎస్ఐ తన సిబ్బంది ఆ ఇంటికి వెళ్లి పరిశీలించారు. బీరువా పగులగొట్టి 10 సవర్ల బంగారం దొంగిలించినట్లు తెలిసిందని ఎస్ఐ ఎస్కె మహమ్మద్ రఫీ కేసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. దూరప్రాంతాలకు వెళ్ళే వారు తమ ఇళ్లలో ఖరీదైన వస్తువులు, నగదు ఉంచకుండా లాకర్లలో భద్రపర్చుకోవాలని సూచించారు.

పారిశుధ్య పనులు వేగవంతం

ప్రజాశక్తి - కారంచేడు

మండలంలోని ఆదిపూడిలో పారిశుధ్యం మెరుగు పర్చడానికి ప్రత్యేక చర్యలు చేపట్టామని కార్యదర్శి లింగిశెట్టి కృష్ణ చెప్పారు. ఆదివారం పనులు ప్రారంభించారు. గ్రామంలో సైడ్ కాలవలు శుభ్రపర్చే ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తుఫాను హెచ్చరికల నేపద్యంలో గ్రామంలోని డ్రైనేజీ తూముల్లో పేరుకుపోయిన చెత్త, చెదారం తొలగించే ప్రత్యేక కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. డ్రైనేజీ కాలువల్లో చెత్త వేయకూడదని సూచించారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

ప్రజాశక్తి - చెరుకుపల్లి

మండలంలోని ఆరుంబాక గ్రామ సమీపంలో యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన ఆదివారం జరిగింది. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందజేశారు. మృతుడు చెరుకుపల్లి బ్యాంక్ ఆఫ్ ఇండియా సమీపంలో ఫ్యాన్సీ షాపు నిర్వహించే సాయి ఫ్యాన్సీ యజమాని కుమారుడు బచ్చు సాయి (32)గా పోలీసులు గుర్తించారు. మృత దేహం వెంబడి పురుగుల మందు ప్యాకెట్ లభించడంతో ఆ మందు తీసుకొని మృతి చెందినట్లుగా అనుమానిస్తున్నారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతునికి వివాహమైంది. మృతుడు సాఫ్ట్వేర్ ఇంజనీర్గా పనిచేస్తున్నాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తున్నారు. పోలీసు విచారణలో పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

భక్తులకు అన్నదానం

ప్రజాశక్తి - ఇంకొల్లు

స్థానిక మిట్టపాలెంలోని రామ మందిరం నిర్మించి 50ఏళ్ళు పూర్తయిన సందర్భంగా రజతోత్సవ వేడుకలు నిర్వహించారు. సీతారామలక్ష్మణులు, హనుమంతుని విగ్రహా మూర్తుల నగరోత్సవం చేశారు. సీతారాముల కళ్యాణం నిర్వహించారు. భక్తులకు అన్నసంతర్పణ చేశారు.

వృత్తి కోల్పోయిన చేనేతలకు భూమి ఇవ్వాలి

ప్రజాశక్తి - చీరాల

మాట్లాడుతున్న కో ఆర్డినేటర్ పి పూర్ణచంద్రరావు

వృత్తి కోల్పోయిన చేనేతలకు రాష్ట్ర ప్రభుత్వం భూమి పరిహారం ఇవ్వటంతో పాటు కుటుంబానికి నెలకు ఇచ్చే రూ.5వేలు పింఛను సరిపోదని, దానిని వెంటనే పెంచాలని ఎఐబీఎస్సి జాతీయ సమన్వయకర్త, ఉమ్మడి ఎపి మాజీ డీజీపీ డాక్టర్ జె పూర్ణచంద్రరావు కోరారు. పేరాల పద్మశాలీయ కళ్యాణ మండపంలో ప్రజాబంధు ప్రగడ కోటయ్య ప్రాంగణంలో నిర్వహించిన రాష్ట్ర చేనేత సదస్సులో ఆయన మాట్లాడారు. చేనేతల పునరావాసం కోసం 200 ఎకరాల ప్రత్యేక ఎకానమిక్ జోన్ (సెజ్) ఏర్పాటు చేసి, మగ్గం ఉన్న ప్రతి కుటుంబానికి 100 నుంచి 150 గజాల భూమి కేటాయించాలని చేశారు. మాజీ ఎమ్మెల్యే మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్సీలు కలిసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది వై కోటేశ్వరరావు (వైకె), ఆహ్వాన కమిటీ అధ్యక్షుడు దామర్ల శ్రీకృష్ణ, కన్వీనర్ జంజనం శ్రీనివాసరావు, కార్యదర్శి చండూరు వాసు, డాక్టర్ హైమా సుబ్బారావు, వేమేశ్వరి, శీలం వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

పంట నష్టపరిహారం అందేదెప్పుడు?

నష్టపరిహారం కోసం ఎదురుచూస్తున్న రైతులు

ప్రజాశక్తి - పంగులూరు

దెబ్బతిన్న మినుమును పరిశీలిస్తున్న రైతులు (ఫైల్)

మెంతా తుఫాను కారణంగా నష్టపోయిన రైతులు నష్టపరిహారం ఎప్పుడు అదుతుందని ఎదురుచూస్తున్నారు. నష్టపరిహారం రబీ సీజన్ పంటలకైన ఉపయోగ పడుతుందని ఆశపడుతున్నారు. అయితే ప్రభుత్వం నుంచి నష్ట పరిహారంపై ఇంతవరకు ఎలాంటి ప్రకటన రాలేదు. దీంతో రైతులు నిరాశ చెందుతున్నారు. గత అక్టోబర్ నెల ఆఖరి వారంలో మోంతా తుఫాను కారణంగా మండలంలో పలు పంటలు దెబ్బతిని రైతులు నష్టపోయిన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ తుఫాన్లో మినుము, పత్తి, మొక్కజొన్న పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ విషయమై వ్యవసాయ అధికారులు రైతులు ఎన్ని ఎకరాల్లో ఏ పంట ఎంత నష్టపోయారనే వివరాలు ప్రభుత్వానికి నివేదించారు. మినుము 1039 మంది రైతులకు చెందిన 1843 ఎకరాల్లో దెబ్బతిన్నది. రూ.1.11కోట్లు నష్టపోయినట్లు అంచనా వేశారు. పత్తి 45 మంది రైతులకు చెందిన 74.78 ఎకరాల్లో దెబ్బతిన్నట్టు గుర్తించారు. ఇందుకుగాను రూ.7,55,500 నష్టపోయినట్లు అంచనా వేశారు. మొక్కజొన్న పంట 28 మంది రైతులకు చెందిన 68 ఎకరాల విస్తీర్ణంలో నష్టపోగా రూ.4,12,500 నష్టం అంచనా వేశారు. ఈ మూడు పంటలు కలిపి రూ.1,23,43,000 నష్టపోయినట్లు అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు. అయితే నివేదిక పంపి నెల రోజులు కావస్తున్న ఇంతవరకు ప్రభుత్వం నుండి నష్టపరిహారం ఊసే కనపడటం లేదని రైతులు చెబుతున్నారు. నష్ట పరిహారం వస్తే రబీ పంటల సాగులో కొంతవరకు ఉపయోగపడతాయని రైతులు ఆశపడుతున్నారు. ఆ ఆశలేమి నెరవేరే విధంగా లేవని కొంత మంది రైతులు చెబుతున్నారు. ఏదేమైనా రైతులకు ప్రభుత్వం వీలైనంత త్వరలో పంట నష్టపరిహారం అందించాలని, రైతాంగాన్ని ఆదుకోవాలని కోరుతున్నారు.

మాజీ మంత్రి గాదె జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - ఇంకొల్లు

శుభాకాంక్షలు తెలుపుతున్న రావూరి వేణుబాబు

మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి జన్మదినోత్సవ వేడుకలు మండలంలోని ఆయన స్వగ్రామం పావులూరులో ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్వగృహంలో వైసీపీ ఇన్ఛార్జి గాదె మధుసూదనరెడ్డి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తండ్రి వెంకటరెడ్డి సుదీర్ఘకాలంగా రాజకీయంలో కొనసాగారని అన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యద్దనపూడి : మాజీ మంత్రి, సీనియర్ నాయకులు గాదె వెంకటరెడ్డి పుట్టినరోజు వేడుకలు ఆదివారం నిర్వహించారు. గాదె మధుసూధనరెడ్డితో పాటు వైసిపి మండల కన్వీనర్ రావూరి వేణుబాబు పాల్గొని మాట్లాడారు. వేడుకల్లో వైసిపి యద్దనపూడి గ్రామ అధ్యక్షులు నల్లపనేని లక్ష్మినారాయణ, ముస్లిం మైనార్టీ ప్రెసిడెంట్ షేక్ బుడే, టీచర్స్ విభాగం నాగూర్ బాష, ఎంపిపి తనయుడు చంద్, యువ నాయకులు అఖిల్ బాబు, జె విజయ్, సురేష్, చార్లెస్, నాగూర్, యేసు రత్నం, జాన్, ప్రభుదాస్, రైతు నాయకులు వందనం, జాగార్లమూడి మాజీ సర్పంచ్ పోతిరెడ్డి, బసివిరెడ్డి, రాంబాబు, హరిబాబురెడ్డి, శ్రీనివాసరెడ్డి, సాయి బాబు, బొందు ప్రకాష్, జి సురేష్ పాల్గొన్నారు.



శిబిరంలో వైద్య సేవలు అందించిన వైద్యులు

ఆరోగ్య రక్షణకే ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - బాపట్ల

పేదల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు యజ్ఞ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ యజ్ఞ శ్రీకాంత్ తెలిపారు. పిన్ని బోయినవారి పాలెంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 300 మందికిపైగా పరీక్షలు చేయించుకున్నట్లు తెలిపారు. డాక్టర్ మాధవి బెల్లంకొండ, డాక్టర్ టి శ్రీనివాస కుమార్ వైద్య సేవలు అందించారు.

ఉపాధ్యాయుడిని సత్కరిస్తున్న దృశ్యం

విజయకుమార్‌కు ఘన సత్కారం

ప్రజాశక్తి - నిజాంపట్నం

బాపట్లలో నిర్వహించిన జిల్లా స్థాయి పారా ఈవెంట్స్‌లో అత్యుత్తమ ప్రతిభ ప్రదర్శించిన ఉపాధ్యాయుడు వేల్పుల విజయకుమార్‌ను సమగ్ర శిక్ష సహిత జిల్లా కోఆర్డి నేటర్ ఎం జ్యోస్నా, ఎం శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసరావు, తదితర సిబ్బంది కలిసి ఘనంగా సత్కరించారు. ఎంఇఒలు ఆర్ శోభాచంద్, జి శేషగోపాలం, హెచ్ఎం వెంకటేశ్వరరావు అభినందించారు.

మంత్రికి మొక్క అందజేస్తున్న ఆర్డీఒ గ్లోరియా

మంత్రికి స్వాగతం

ప్రజాశక్తి - బాపట్ల

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొలుసు పార్ధసారధి బాపట్ల పర్యటనకు ఆదివారం వచ్చిన సందర్భంగా ఆర్డిఓ పి గ్లోరియా, తహశీల్దారు షేక్ షలీమా మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు మొక్క అందజేసి స్వాగతం పలికారు.

వాసును సత్కరిస్తున్న గాదె మధుసూదనరెడ్డి

వైసిపి పట్టణ అధ్యక్షులుగా వాసు

ప్రజాశక్తి - ఇంకొల్లు

వైసిపి పట్టణ అధ్యక్షుడిగా కర్రి వాసును ఖరారు చేశారు. వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గాదె మధుసూదనరెడ్డి ఆదివారం వాసు పేరు ప్రకటించారు. ఈ సందర్భంగా వాసును ఆయన శాలువాతో సత్కరించారు. వైసీపీ సీనియర్ నాయకులు ప్రభాకర్, వైసిపి మండల అధ్యక్షులు చిన్ని పూర్ణచంద్రరావు, పోపోరి మోహన్రావు, పావులూరు సొసైటీ మాజీ చైర్మన్, జిల్లా రైతు ప్రతినిధి పులకండం రామకృష్ణ అభినందించారు.

హ్యాపీ సండే వాయిదా

ప్రజాశక్తి - బాపట్ల

పట్టణంలో ఆదివారం జరగాల్సిన హ్యాపీ సండే వినోద కార్యక్రమం వాతావరణ మార్పుల కారణంగా తాత్కాలికంగా రద్దు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి తెలిపారు. వచ్చే ఆదివారం యధావిధిగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

పాచినీటిని వెళ్లగొడితేనే పరిశుభ్రం

ప్రజాశక్తి - ఇంకొల్లు

స్థానిక నాగుల చెరువులో దక్షిణం వైపు గత ఐదు రోజులుగా నీటిని మోటారుతో బయటకు వెళ్లగొడుతున్నారు. చెరువులో నీరు రంగు మారి చేపలు సైతం చనిపోయిన సంఘటన గతంలో జరిగింది. చెరువులోని నీరు చెడిపోవడంతో ఆ నీటిని వాడినవారికి దద్దుర్లు, దురద వస్తున్నాయని ప్రజలు తెలిపారు. దీంతో చెడిపోయి దుర్గంధం వెదజల్లుతున్న నీటిని పంచాయతీ ఆధ్వర్యంలో బయటికి వెళ్లకొడుతున్నారు. చెరువులో చేపలు సైతం పట్టి చెరువు వద్ద అమ్మడం లేదు. చేపల వేటకు ఇటీవల బహిరంగ వేలం నిర్వహించారు. ఎన్టీఆర్ బొమ్మవైపు ఉన్న దక్షిణ భాగం చెరువును పూర్తిగా నీరు వెళ్లగొట్టి శుభ్రం చేయనున్నట్లు పంచాయితీ కార్యదర్శి తెలిపారు.

కాలువలోకి దూసుకెళ్లిన కారు

కాలువలోకి దూసుకెళ్లిన కారు

ప్రజాశక్తి - బాపట్ల

బాపట్ల, పొన్నూరు మార్గంలో బాపట్ల నుండి అప్పికట్ల వైపు వెళుతున్న కారు అదుపుతప్పి ఆదివారం కాలువలోకి దూసుకెళ్లింది. కాల్వలోకి తలకిందులుగా పడ్డ కారులో భార్య, భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అ మార్గంలో వెళుతున్న వాహనా దారులు ప్రమాదాన్ని గమనించి వెంటనే స్పందించి కారులోని వారిని సురక్షితంగా బయటకు తీశారు. దీంతో ప్రాణాపాయం నుండి బయట పడ్డామని ఊపిరి పీల్చుకున్నారు. కాలువలో నీరు లేకపోవడమే ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

అద్దంకి, చిన్నగంజాంకు హై అలర్ట్

- తుపాను నష్టాన్ని తగ్గించేందుకు సిద్ధంగా ఉండాలి..
- మంత్రి కొలుసు పార్థసారథి

మాట్లాడుతున్న మంత్రి కొలుసు పార్థసారథి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

దిత్వా తుపాను నష్టాన్ని తగ్గించడానికి జిల్లా యంత్రాంగమంతా సంసిద్ధంగా ఉండాలని రాష్ట్ర సమాచార పౌర సంబంధాల మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. దిత్వా తుపాను హెచ్చరికతో ముందస్తు జాగ్రత్త చర్యలపై అన్ని శాఖల జిల్లా అధికారులతో ఆదివారం ఆయన స్థానిక కలెక్టరేట్‌లో సమీక్షించారు. గత తుపాను అనుభవాలతో మరింత సమర్థంగా, అధికారులు స్ఫూర్తితో పనిచేయాలని మంత్రి సూచించారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అధికారులు అప్రమత్తం కావాలన్నారు. జిల్లాలో అద్దంకి, చిన్నగంజాం మండలాలకు హై అలర్ట్ ఉందన్నారు.

గత తుపానులో జిల్లా యంత్రాంగమంతా కలెక్టర్ నాయకత్వంతో సమష్టిగా పని చేశారని అభినందించారు. అదే మాదిరిగా రానున్న భారీ వర్షాలను సమర్థంగా ఎదుర్కోవడానికి సంసిద్ధం కావాలన్నారు. జిల్లాలో తీర ప్రాంతం అధికంగా ఉన్నందున ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు ఎన్ని ఉన్నాయి, బోట్లు అన్ని తీరానికి వచ్చాయా లేదా పున్ణపరిశీలన చేయాలన్నారు. మత్స్యకారులను సముద్రంలోనికి వెళ్ళనీయరాదన్నారు.

రైతులకు నష్టం జరగకుండా చర్యలు

ధాన్యం పండించిన ఏ ఒక్క రైతుకు నష్టం జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి చెప్పారు. భారీ వర్షాల నేపథ్యంలో వరి పంట కోత కోయరాదన్నారు. దిత్వా తుపాను ప్రభావం బాపట్ల జిల్లాపై కొంతమేర చూపనుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. అద్దంకి, చిన్నగంజాం మండలాల్లో భారీ వర్షాలు కురుస్తాయని, హైఅలర్ట్ వచ్చిందన్నారు. ఆ మేరకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని మంత్రికి వివరించారు. కలెక్టరేట్లో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, 24 గంటల పాటు కంట్రోల్ రూమ్ పనిచేసేలా సిబ్బందిని నియమించామన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు సమర్థంగా నడుస్తున్నాయని జిల్లా సంయుక్త కలెక్టర్ భావన విశిష్ట చెప్పారు. బాపట్ల జిల్లాలో 167 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఇప్పటికే 488 మంది రైతులకు స్లాట్ లు ఇచ్చామన్నారు. ప్రస్తుతం 58 కేంద్రాలలో 2,922 మెట్రిక్ టన్నులు ధాన్యం సేకరించామన్నారు. 598 వాహనాలకు జిపిఎస్ ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే మూడు వేల టార్పాలిన్ పట్టలు రైతు సేవా కేంద్రాలకు చేరాయని, మరో 1,100 టార్పాలిన్ పట్టలు కొనుగోలు చేశామని, సోమవారం ఆయా ప్రాంతాలకు చేరుతాయన్నారు. 28 మిల్లులు బ్యాంకు పూచికత ఇవ్వగా ధాన్యం సేకరణ ప్రక్రియ వేగంగా సాగుతుందన్నారు. 1.50 లక్షల గోనె సంచులు రైతు సేవా కేంద్రాలలో సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో డి ఆర్ ఓ జి.గంగాధర్ గౌడ్, ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ముంపుకు గురయ్యే గ్రామాల ప్రజలను

సురక్షిత ప్రాంతాలకు తరలించాలి

కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజలతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి-అద్దంకి

దిత్వా తుపాను హెచ్చరిక నేపథ్యంలో భారీ వర్షాలకు ముంపునకు గురయ్యే గ్రామ ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. అద్దంకి నియోజకవర్గంలోని అద్దంకి మండలం, కొరిశపాడు మండలాలలో ఆదివారం ఆయన విస్తృతంగా పర్యటించారు. కొరిశపాడు మండలం మేదరమెట్ల రెవిన్యూ గ్రామం పరిధిలోని తిమ్మనపాలెం గ్రామ చెరువును ఆయన పరిశీలించారు. 95 శాతం నిండుగా చెరువు ఉండడంతో భారీ వర్షాలకు చెరువు కట్ట తెగకుండా ముందస్తుగా బలోపేతం చేయాలన్నారు. చెరువు లోపలకు నీటి ప్రవాహం వచ్చే మార్గంలో పూడికతీత యుద్ధ ప్రాతిపదికను తొలగించాలన్నారు. వర్షాలకు చెరువు నిండితే వెలుపలకు వెళ్లే మార్గం సరి చేయాలన్నారు. జాతీయ రహదారికి ఎలాంటి ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

గుండ్లకమ్మ ప్రాజెక్టు ముంపు ప్రాంతమైన అద్దంకి మండలం, ధేనువకొండ గ్రామాన్ని కలెక్టర్ పరిశీలించారు. అద్దంకి మండలం, గాజులపాలెం సచివాలయాన్ని తనిఖీ చేశారు. విపత్తు నిర్వహణ ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. పంట కాలువలో పూడికతీత, గుర్రపు డెక్క తొలగించడానికి జెసిబి యంత్రాలను సిద్ధం చేసుకోవాలన్నారు. జనరేటర్లు, చెట్లు తొలగించడానికి తదితరమైన యంత్రాలు సిద్ధంగా ఉంచుకోవాలని అధికారులను ఆదేశించారు. అధిక వర్షపాతం నమోదైతే దేనువకొండ గ్రామంలో కొన్ని గృహాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉందన్నారు. వారిని యుద్ధ ప్రాతిపదికన తరలించడానికి ఏర్పాట్లు చేయాలన్నారు. ఇప్పటికే దేనువకొండలో గుర్తించిన ప్రాథమిక పాఠశాల పునరావాస కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. పునరావాస కేంద్రంలో వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. తక్షణమే విద్యుత్ దీపాలు, నీటి వసతి తదితరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. గుండ్లకమ్మ నది పరివాహక ప్రాంతాలపై ఆరా తీశారు. ఏయే ప్రాంతాలలో వరద నీరు వస్తుందని అంశాలపై సంబంధిత శాఖల అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గత తుపాను సమయంలో గుండ్లకమ్మ నదికి 90 క్యూసెక్కుల నీరు వచ్చిందని ఇంజినీరింగ్ అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఈ నేపథ్యంలో ఎగువ ప్రాంతంలో భారీ వర్షాలు కురిస్తే చిలకలేరు, దోర్నపువాగులు పొంగి పొర్లిపారే అవకాశం ఉందని, ఇంజినీరింగ్ అధికారులు వివరించారు. చెరువుకొమ్మపాలెం చప్టా వద్ద వర్షపు నీరు అధికంగా వచ్చే అవకాశం ఉందని, సమీప ప్రాంతాల వారిని అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. అద్దంకి పట్టణంలో నీరు నిలిచే కాలనీలలో ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. వీఆర్వోలు, వీఆర్ఏలను ఆయా చెరువులు, కాల్వల చప్టాలు, గట్ల వద్ద అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం ముంపునకు గురయ్యే బాధిత కుటుంబాలకు పునరావాస కాలనీలో నివాస స్థలాలు ఇవ్వాలి, మౌలిక సదుపాయాలు కల్పించాలని గ్రామస్తులు కలెక్టర్ కు విన్నవించారు. ఆయన వెంట చీరాల ఆర్డిఓ టి చంద్రశేఖర్, మునిసిపల్ కమిషనర్, తహసిల్దార్ చరణ్, జల వనరుల శాఖ ఇంజనీర్లు తదితరులు ఉన్నారు.